జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి | శనివారం 10 అక్టోబర్ 2026 | సంపుటి : 17 | సంచిక : 81 | పేజీలు : 8 | వెల : 1/- | RNI NO.APTEL/2010/36516

శ్రీ పరాభవ నామ సంవత్సరం, మాసం : జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం, సూర్య చంద్రుల సమయాలు సూర్యోదయం : 5:28 , సూర్యాస్తమయం : 6:32 , చంద్రోదయం : 3:38 చంద్రాస్తమయం : 3:07 పంచాంగం, తిథి : శుద్ధ ద్వాదశి రా. 10:31 వరకు, తర్వాత త్రయోదశి, నక్షత్రం: విశాఖ రా. 8:10 వరకు, తర్వాత అనూరాధ, యోగం : సిద్ధం మ. 1:19 వరకు, తర్వాత సాధ్యం, కరణం: బవ ఉ. 9:47 వరకు, తర్వాత బాలవ రా. 10:31 వరకు, తర్వాత కౌలవ

Published From RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA | http://www.prajajyothinews.com | Mail : prajajyothidaily@gmail.com

**WANTED**

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

సంప్రదించవలసిన నెంబర్లు

94402 31967

# బతుకమ్మ

పెద్దింటిలో పూసిన గులాబీలకే కాదు పేదింటి ముంగిట్లో విరిసిన ముద్దబంతికీ, అడవిలో తట్టుకుని నిలిచిన తంగేడుకు నిండుగా దీవించమని వచ్చిన గునుగుకు ప్రకృతిలో పూసే ప్రతి పువ్వుతోనూగుడి కట్టి కొలిచే శక్తి స్వరూపిణి బతుకమ్మ. కుటుంబ సౌభాగ్యం, సంతోషం, శ్రేయస్సుకు ఐక్యంగా కదిలివచ్చి, కొలిచే ఆదిపరాశక్తే బతుకమ్మ. పూలన్నీ కలిసి జనం గొంతులో నింపే సామూహిక స్ఫూర్తి. ఆచరణ, ఆధ్యాత్మికత, ఆనందాన్ని ఒడినిండా నింపుకునే ఆడబిడ్డల కోసం దివి నుంచి భువికి వచ్చిన గౌరమ్మ బతుకమ్మ. తొమ్మిది రోజులు వేడుకగా అమ్మవారిని కోరినంతగా కొలుచుకునే భాగ్యం బతుకమ్మ రూపంలో తెలంగాణ ఇంటింటికీ చేరింది. జానపద జన జీవనాన్నీ, సాంస్కృతిక వారసత్వాన్ని,ప్రాంతీయ అస్తిత్వాన్ని అందంగా చాటుతూనే ఉంది. దేశ విదేశాలలోనూ నవరాత్రుల శోభ వెలుగులీనుతూ ఉంది. ఆడబిడ్డల వెతలు, అవగాహన కలిగించే కథనాలు పాటల రూపంలో పరవళ్లు తొక్కుతుంటాయి.





# జర్నలిస్టుల హక్కులు.. సంక్షేమమే లక్ష్యం!

## టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నేతలు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, సలీం పాషా

## టీయూడబ్ల్యూజే (ఐజేయూ) చేవెళ్ల ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా నరేందర్‌రెడ్డి ఏకగ్రీవం




**చేవెళ్ల అక్టోబర్ 09(ప్రజా జ్యోతి):**టీయూడబ్ల్యూజే (ఐజేయూ) చేవెళ్ల నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా పడమటి నరేందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం చేవెళ్లలోని జీపీఆర్ ఫామ్‌హౌస్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సలీం పాషా మాట్లాడుతూ.. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు అందించడంతోపాటు ఇళ్ల స్థలాల సాధనకు పోరాడుతామని పేర్కొన్నారు.




# తెలంగాణలో డిజిటల్ సేవలు చివరి వ్యక్తి వరకు పంపిణీ

బలోపేతం చేస్తున్న భారత తపాలా శాఖ..

ఆర్థిక సేవల విస్తరణ

ఒకే తపాలా వ్యవస్థ, అపరిమిత అవకాశాలు”-ప్రజలకు అందుబాటులో ఉండే, సాంకేతికత ఆధారిత సేవలు అందించడమే లక్ష్యం: సీపీఎంజీ డీఎస్‌వీఆర్ మూర్తి

ప్రతి నెలా 20 లక్షల మంది చేయూత పింఛన్ లబ్ధిదారులకు సేవలు.. 263 ఆధార్ కేంద్రాల ద్వారా పౌర సేవలు

17 విడతల రోజ్‌గార్ మేళాల ద్వారా 1,86,202 నియామక పత్రాల అందజేత.. తెలంగాణ ప్రాంతంలో 1,272 మంది అభ్యర్థుల ఎంపిక



# మొయినాబాద్ క్రిమినల్ కేసులు చేవెళ్ల కోర్టుకు బదిలీ

## సమయం, ఖర్చులు ఆదా అవుతుండటంపై ప్రజల్లో హర్షం

**మొయినాబాద్ : అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి)** మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రిమినల్ కేసులను చేవెళ్ల కోర్టు పరిధిలోకి మార్చడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయంతో న్యాయస్థానాలకు వెళ్లే ప్రజలకు ప్రయాణ ఇబ్బందులు తగ్గడంతో పాటు సమయం, ఖర్చులు ఆదా కానున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటివరకు మొయినాబాద్ ప్రాంతానికి సంబంధించిన సివిల్ కేసులు, ట్రాఫిక్ కేసులు, ఎక్సైజ్ (అబ్కారీ) కేసులు చేవెళ్ల కోర్టు పరిధిలో ఉండగా, క్రిమినల్ కేసులు మాత్రం రాజేంద్రనగర్ కోర్టు పరిధిలో ఉండేవి. దీంతో ఒకే వ్యక్తికి వేర్వేరు కేసులు ఉన్న సందర్భాల్లో రెండు ప్రాంతాల్లోని న్యాయస్థానాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడేది. దీనివల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు.



# ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ

**బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..**
**బంగారు బతకమ్మ ఉయ్యాలో..**
**మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ**
**షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ , కేశంపేట మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి లు స్పష్టం**
**ఉల్లాసంగా ఉత్సాహంగా..ఆట పాటలతో స్టెప్పులేసిన కాంగ్రెస్ నాయకులు**



**కొత్తూరు అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి)** దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని షాద్నగర్ బుగ్గారెడ్డి గార్డెన్ లో శుక్రవారం ఎన్ ఎస్ యు ఐ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ ఆటపాట దుమ్ము రేపింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కేశంపేట మాజీ జెడ్పిటిసి సభ్యురాలు తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతిని ఆరాధించే సంప్రదాయానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. కేశంపేట మాజీ జెడ్పిటిసి సభ్యురాలు తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, గిరిజన ఆదివాసీ రాష్ట్ర సమన్వయకర్త రఘు నాయక్, కౌన్సిలర్ సి. పెంటయ్య, మురళీమోహన్, కొప్పునూరి ప్రవీణ్, దిలీప్, రాజు నాయక్, ముబారక్ అలీ ఖాన్, చందులాల్, బాలరాజు గౌడ్, కేకే కృష్ణ, కత్తి చంద్రశేఖరప్ప, గుట్ట రాజు, మధువులు యాదవ్, కరుణాకర్, మంగ మధు, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి నరేందర్, కళాశాల విద్యార్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఖేలో తెలంగాణ బంధన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

**ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో క్రీడలదే కీలక పాత్ర**
**ప్రజలు నిత్యం వ్యాయామం చేయాలి.. క్రీడల్లో భాగస్వాములు కావాలి**





**బోయిన్‌పల్లి, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తూ, తెలంగాణలో క్రీడా సంస్కృతిని విస్తరించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర క్రీడల శాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఖేలో తెలంగాణ బంధన్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో ఎమ్మెల్యే శ్రీ గణేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాకింగ్, సైక్లింగ్‌తో పాటు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ వంటి క్రీడా కార్యకలాపాల్లో పాల్గొని క్రీడాకారులను, యువతను ఉత్సాహపరిచారు.అనంతరం 'ఖేలో తెలంగాణ బంధన్ ఫిట్‌నెస్ ఛాలెంజ్'లో భాగంగా తొమ్మిది మంది అధికారులకు ఫిట్‌నెస్ ఛాలెంజ్ విసిరారు.హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, కంటోన్మెంట్ సీఈఓ, డీసీపీ, ఏసీపీ గోపాలకృష్ణ మూర్తి తదితర అధికారులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా యువతలో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే రోజువారీ జీవితంలో వ్యాయామానికి సమయం కేటాయించాలని సూచించారు. వాకింగ్, సైక్లింగ్, యోగా లేదా తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో ప్రతిరోజూ పాల్గొనాలని కోరారు.రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, క్రీడా కార్యక్రమాలు, పోటీల నిర్వహణ ద్వారా యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటోందని అన్నారు. 'జాగో తెలంగాణ -- భాగో తెలంగాణ -- ఖేలో తెలంగాణ' నినాదంతో ఫిట్‌నెస్ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కంటోన్మెంట్ నియోజకవర్గ ప్రజలు ఫిట్‌నెస్ ఛాలెంజ్‌లో చురుగ్గా పాల్గొని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే శ్రీ గణేష్ కోరారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా క్రీడలు, యువజన సంక్షేమ అధికారి నందకిషోర్, సాయ్+ అధికారులు గోకుల్, కన్నం మధు, సురేష్ కాలేరు, జింఖానా గ్రౌండ్ సిబ్బంది, కోచ్‌లు, వివిధ పాఠశాలల విద్యార్థులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బతుకమ్మ.. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక

**సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి**
**ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కాంచనలత**





**చేవెళ్ల అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి):** బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. సి. కాంచనలత అన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. కళాశాలలో కార్యక్రమ సమన్వయకర్త ఎ. కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగు రంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో కళాశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబైన విద్యార్థినులు బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి పూలతో అలంకరించిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కాంచనలత మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధించే గొప్ప సంప్రదాయమని, పూలతో ప్రకృతిని పూజించడం తెలంగాణ సంస్కృతిలోని ప్రత్యేకతను చాటుతుందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో మన సంస్కృతిపై అవగాహన పెంచడంతోపాటు ఐకమత్యం, పరస్పర గౌరవం, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థుల ఆటపాటలు, బతుకమ్మ పాటల నడుమ సంబరాలు ఉత్సాహంగా సాగాయి.

# గుండెపోటుతో గిరిజన రైతు మృతి బాధిత కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సాయం అందజేత



**తలకొండపల్లి/కడ్తాల్,అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలంలోని గానుగుమర్ల తండా గ్రామ పంచాయతీకి చెందిన నేనావత్ చందర్ నాయక్ (45) గురువారం అర్ధరాత్రి సమయంలో అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందారు.ఆయన అకాల మరణం తండావాసులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.విషయం తెలుసుకున్న లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు,కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ,రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత జర్పుల దశరథ్ నాయక్,స్థానిక సర్పంచ్ సేవ్యా నాయక్ లు మృతుడి నివాసానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.తమ రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా జర్పుల దశరథ్ నాయక్ రూ.5వేలు,సర్పంచ్ సేవ్యా నాయక్ రూ.10వేలు చొప్పున మొత్తం రూ.15వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శీను నాయక్,రాజు నాయక్, చాంది, లక్ష్మణ్ నాయక్,నాగార్జున నాయక్,గోపి,మాజీ ఉప సర్పంచ్ పాండు,మాజీ వార్డు సభ్యుడు శంకర్ నాయక్, కిషన్ నాయక్,హరి,హరియా, బద్యా,శీను,జగన్ తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ వేడుకల్లో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి



**ఎల్బీనగర్ అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి)** బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి చైతన్యపురి డివిజన్‌లోని న్యూ దిల్‌సుఖ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టైలరింగ్, బ్యూటీషియన్, మెహందీ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసుకున్న మహిళలతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే కార్యక్రమం విజయవంతం కావడంతోనూ కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకురాలు శోభారాణి, సీనియర్ నాయకుడు సంతోష్ యాదవ్, అర్చన, శివబిందు తదితరులు, డివిజన్ మహిళలు పాల్గొన్నారు.

# నేరస్తులపై ఉక్కుపాదం.. శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం!

**అబ్దుల్లాపూర్‌మెట్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా రాజు బాధ్యతల స్వీకరణ**



**అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి):** పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటూ, శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానని అబ్దుల్లాపూర్‌మెట్ నూతన ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు. నేరాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని, ప్రజలకు భద్రత కల్పించడమే ప్రాధాన్యమని పేర్కొన్నారు.ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఫ్యూచర్ సిటీలోని సీసీఆర్‌బీ నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన వై.అశోక్‌రెడ్డి హైదరాబాద్ మల్టీజోన్-2కు బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా నూతన ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల కట్టడికి ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్ సీహెచ్.రాజుకు పోలీస్‌స్టేషన్‌లోని ఎస్ఐలు, సిబ్బంది స్వాగతం పలికారు.

# మిత్ర జాన్ బునియన్‌కు గాంధీ శాంతి పురస్కారం-26




**హైదరాబాద్, అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి) :** ప్రముఖ విద్యావేత్త, సంఘ సేవకుడు, సెయింట్ పాల్ హైస్కూల్(గాంధీనగర్) సలహాదారుడు మిత్ర జాన్ బునియన్‌కు మహాత్మా గాంధీ శాంతి సేవ పురస్కార్-2026 ప్రదానం చేశారు. తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డా.రాజ్ నారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో బుగ్గలకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొ.వి.బాలకృష్ణ రెడ్డి, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వామన్ రావు, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ ఉపకులపతి ప్రొ.సూర్య ధనంజయ ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, లెక్చరర్లు, విద్యార్థులు, సంఘ సేవకులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రక్షాళనను రాజకీయం చేయొద్దు

**అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి**
**నకిలీ, ద్వంద్వ ఓట్లను సరిచేయాలి**
**బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. వైభవ్‌రెడ్డి**



**చేవెళ్ల అక్టోబర్ 09(ప్రజా జ్యోతి):** ఓటరు జాబితా ప్రక్షాళనను రాజకీయ కోణంలో చూడకుండా ప్రజాస్వామ్య పరిరక్షణకు చేపట్టే చర్యగా పరిగణించాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డా. వైభవ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ.. ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలనే సూత్రానికి అనుగుణంగా నకిలీ, ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో నమోదైన ఓట్లను గుర్తించి సరిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఓట్లు తొలగించారంటూ ఆరోపణలు చేస్తున్న రాజకీయ పార్టీలు నిర్దిష్ట ఆధారాలతో తమ అభ్యంతరాలను వెల్లడించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి భారతీయ పౌరుడికి ఓటు హక్కు కల్పించడంతోపాటు, అనర్హమైన నమోదులకు తావులేకుండా చూడాలని అన్నారు. ఓటరు జాబితాలో పేరు తొలగినట్లు భావించే అర్హులు సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి, అవసరమైన గుర్తింపు పత్రాలతో తిరిగి నమోదు చేసుకోవచ్చని తెలిపారు. తొలగించిన ఓట్లన్నింటినీ తిరిగి చేర్చాలనే డిమాండ్ల వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయని వైభవ్‌రెడ్డి విమర్శించారు. భారత పౌరులకే రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కు వర్తిస్తుందని, విదేశీయులు లేదా అర్హతలేని వ్యక్తుల పేర్లు ఓటరు జాబితాలో ఉండకూడదని స్పష్టం చేశారు. అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగకుండా, అనర్హమైన నమోదులను తొలగించేలా ప్రక్షాళన చేపట్టాలని పేర్కొన్నారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు, అర్హుడైన ప్రతి భారతీయ పౌరుడికి ఓటు హక్కు ఉండటమే ప్రజాస్వామ్య స్ఫూర్తి అని తెలిపారు.

## చంద్రధనలో కరెంటు కోతలపై రైతుల ఆగ్రహం

పురుగుల మందుతో సబ్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు



**తలకొండపల్లి,అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** తలకొండపల్లి మండలంలోని చంద్రధన గ్రామ సబ్ స్టేషన్ నుండి చంద్రధన ,రాంపూర్,సంగాయిపల్లి,నల్లరాళ్ల ండా,ఫుల్ సింగ్ తండా గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతోంది.అయితే గత కొన్ని రోజులుగా సరైన సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని శుక్రవారం సబ్ స్టేషన్ వద్ద రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఎల్ నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవకపోవడంతో రైతులు బోరు మోటార్ల కింద వరి నాట్లు వేయటంతో,కరెంటు కోతలతో నాటిన వరి చేలు ఎండిపోతున్నాయని, దీంతో పెట్టుబడి కూడా రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.వెల్జాల్ సబ్ స్టేషన్ నుండి చంద్రధన సబ్ స్టేషన్ కు సరైన లోడ్ విడుదల చేయడం లేదని ఆరోపిస్తూ సబ్ స్టేషన్ వద్ద పురుగుల మందు పట్టుకొని రైతులు నిరసన తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలని,లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అధికారులను రైతులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో చంద్రధన గ్రామ రైతులు శ్రీకాంత్ రెడ్డి,బండేలా రాజు రెడ్డి,గణేష్ యాదవ్,రాజు యాదవ్, కుమార్, శేఖర్,సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## తలకొండపల్లిలో భూ వివాదం...న్యాయం చేయాలని బాధితుడి వినతి





**తలకొండపల్లి,అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** తలకొండపల్లి మండల కేంద్రంలో భూ వివాదం నెలకొంది.తన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారని అంబటి సత్తయ్య కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ వార్డు సభ్యుడు పుల్లారెడ్డి దశరథం అనే వ్యక్తి తమకు చెందిన సర్వే నెంబర్ 4లోని మూడున్నర కుంటల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని బాధితుడు అంబటి సత్తయ్య తెలిపారు.తాను 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమికి ఉన్న కడీలను కూలగొట్టి,ప్రశ్నిస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ భూమిపై తాము కోర్టు నుండి స్టే తెచ్చుకున్నామని,అయినా పట్టించుకోవడం లేదని తెలిపారు.తన కుటుంబ సభ్యులపై ఎస్సీ,ఎస్టీ కేసులు పెడతామని బెదిరిస్తున్నారని,గత ఐదేళ్లుగా మానసికంగా వేధిస్తున్నారని ఆరోపించారు.తనకు ప్రాణహాని ఉందని,తన భూమిని కాపాడి న్యాయం చేయాలని తలకొండపల్లి ఎమ్మార్వో రమేష్ కుమార్ కి శుక్రవారం వినతి పత్రం అందజేశారు.తనకు న్యాయం జరగకపోతే కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన దీక్షకు దిగుతానని రైతు అంబటి సత్తయ్య హెచ్చరించారు.

## భారత్ సముద్ర రంగ అభివృద్ధికి అంతర్జాతీయ భాగస్వామ్యాలు



**హైదరాబాద్, అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి) :** యువత, మహిళల భాగస్వామ్యం, అంతర్జాతీయ సహకారంతో భారత్ సముద్ర రంగాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర ఓడరేవులు, నౌకాయాన, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ ప్రకటించినట్లు ఆ శాఖ కార్యదర్శి విజయ్ కుమార్ శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'సాగరమంథన్-2026'లో భాగంగా సౌదీ అరేబియా, బెల్జియం, భూటాన్ ప్రతినిధులతో ఓడరేవుల పెట్టుబడులు, గ్రీన్ షిప్పింగ్, వాణిజ్య మార్గాలు, నైపుణ్యాభివృద్ధిపై చర్చించారని తెలిపారు. సహాయ మంత్రి శంతను ఠాకూర్ గ్రీస్, లిథువేనియా, మొజాంబిక్, మయన్మార్ ప్రతినిధులతో పోర్టుల అభివృద్ధి, నౌకల నిర్మాణం, మరమ్మతులు, సముద్ర భద్రతపై చర్చలు జరిపారని చెప్పారు. 2030 నాటికి సముద్ర రంగంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు 'మిషన్ 20 శాతం' లక్ష్యంగా పెట్టుకున్నట్లు సోనోవాల్ వెల్లడించారని తెలిపారు. 2070 నాటికి నెట్ జీరో లక్ష్య సాధనకు గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా, మిథనాల్ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

## దుర్గామాత విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి కల్వకుర్తి ఎమ్మెల్యేకు ఆహ్వానం



**తలకొండపల్లి,అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** తలకొండపల్లి మండల కేంద్రంలో నిర్మించనున్న దుర్గామాత ఆలయ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డిని తలకొండపల్లి ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.తలకొండపల్లి గ్రామానికి చెందిన స్థానిక నేత నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.అనంతరం మండలంలో రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర విద్యుత్ సంక్షోభాన్ని నరసింహారెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.పంటలకు సరైన సమయంలో కరెంటు లేకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని వివరించారు.దీనిపై ఎమ్మెల్యే వెంటనే స్పందించి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడారు.మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించి రైతులకు నాణ్యమైన త్రీఫేస్ విద్యుత్ అందించాలని ఆదేశించారు.ఎమ్మెల్యే తక్షణ స్పందన పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యం,ఇట్టమోని మల్లేష్ యాదవ్,పోచారం గిరిందర్ రెడ్డి,పుట్ట పాండు,ఈసారి శ్రీకాంత్,పుట్ట భరత్,కటికెల శ్రీకాంత్,హనీమూన్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## తారా మల్టీ స్పెషాలిటీ చిల్డ్రన్స్ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో కొత్తకుర్మ మంగమ్మ, శివ కుమార్



**అబ్దుల్లాపూర్ మెట్టు అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి)** సాగర్ జాతీయ రహదారి తుర్కయంజాల్ బ్రాహ్మణపల్లి చౌరస్తాలో శుక్రవారం తారా మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ కార్యదర్శి కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ కొత్తకుర్మ మంగమ్మ విచ్చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారిని శాలువాతో ఘనంగా సత్కరించి సాదరంగా ఆహ్వానం పలికారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తారా మల్టీ స్పెషాలిటీ చిల్డ్రన్స్ హాస్పిటల్ బ్రాహ్మణపల్లి చౌరస్తాలో ఏర్పాటు చేయడం అభినందనీయమని, అనుభవజ్ఞులైన డాక్టర్ల పర్యవేక్షణలో రోగులకు వైద్య సేవలు అందిస్తూ ప్రజలందరికీ అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్య సేవలను అందించాలని, ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శత్రుఘ్నారాజు తదితరులు పాల్గొన్నారు.

## పాతకోటతండా అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం



**తలకొండపల్లి,అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** తలకొండపల్లి మండల పరిధిలోని పాతకోట తండా గ్రామపంచాయతీలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి శుక్రవారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో పాతకోటతండా సర్పంచ్ తో పాటు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు.గ్రామంలో ప్రధానంగా రోడ్ల నిర్మాణం,అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ భవన నిర్మాణ పనులను పూర్తి చేయడం,గ్రామానికి నూతన రేషన్ షాపు మంజూరు చేయడంతో పాటు ఇతర మౌలిక సదుపాయాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని వినతి పత్రం ద్వారా కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పత్లావత్ ధర్మా,ఉప సర్పంచ్ కాట్రావత్ గోపి,వార్డు సభ్యులు కె.శంకర్,పి.లక్ష్మి,తిరుపతి,వి.సుశీల, శీను,పి.శ్రీను,పి.ప్రియాంక,ధర్మా,పి.జుమ్మి,పండు,పి.దేశ్యా నాయక్,గ్రామ పెద్దలు కొర్ర కిషన్,కొర్ర లాలు,యూత్ ప్రెసిడెంట్ శ్రీను,గ్రామ యువకులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

తారా మల్టిస్పెషాలిటీ చిల్డ్రన్స్ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి

వైద్య సేవలు అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలి. ఎంపీ ఈటెల



**అబ్దుల్లాపూర్ మెట్టు అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి)** సాగర్ జాతీయ రహదారి తూర్కయంజాల్ బ్రాహ్మణపల్లి చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన తారా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాలు సినిమాటోగ్రఫి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటెలా రాజేందర్ లు ముఖ్య అతిథులుగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు.వారి వెంట బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నోముల దయానంద్ గౌడ్,జిహెచ్ఎంసి 53,56 డివిజన్ ల బిజెపి పార్టీ అధ్యక్షులు ఎలిమినేటి నరసింహారెడ్డి,లు పాల్గొని ఆసుపత్రిలోని వివిధ విభాగాల రిబ్బన్ కటింగ్ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించే లక్ష్యంతో తూర్కయంజాల్ లో 'తారా మల్టిస్పెషాలిటీ చిల్డ్రన్స్ ఆసుపత్రిని ఘనంగా ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించి లాభాపేక్షతో కాకుండా సేవా గుణంతో ప్రజలకు వైద్యం చేయాలనీ సూచించారు,ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు బచ్చి గళ్ళ రమేష్, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు కందాల బల్దేవ్ రెడ్డి పాల్గొన్నారు.

## గార్వీ షరీఫ్ కార్యక్రమంలో ముద్దం నర్సింహ యాదవ్

శాంతి, సౌభ్రాతృత్వంతో కలిసి మెలిసి జీవించాలి



**బోయిన్‌పల్లి, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని అలీ కాంప్లెక్స్ సమీపంలో నిర్వహించిన గార్వీ షరీఫ్ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యత వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవం,ప్రేమాభిమానాలతో కలిసి మెలిసి జీవించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఇర్ఫాన్, నసీర్ ఖాన్, అజీం మాము, అక్బర్ ఖాన్, అస్లాం, అంజద్, ఇలియాజ్, బబ్బన్, షకీల్ తదితరులు, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో వినోద్ కుక్‌వేర్ క్రియేటర్ యాక్టివేషన్



**హైదరాబాద్ (ప్రజాజ్యోతి)** వినోద్ ఇంటెలిజెంట్ కుక్‌వేర్‌లి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో క్రియేటర్ యాక్టివేషన్ కార్యక్రమం జరిగింది. అగ్రోమెక్ ఇండస్ట్రీస్ సహకారంతో అక్టోబర్ 8న నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫుడ్, లైఫ్‌స్టైల్, హోమ్ విభాగాలకు చెందిన 50 మందికి పైగా క్రియేటర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా కుక్-ఆఫ్, క్విజ్‌లు, గేమ్స్, ఉత్పత్తుల ప్రదర్శన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వినోద్ కుక్‌వేర్‌కు చెందిన స్టెయిన్‌లెస్ స్టీల్, ప్లాటినమ్ ట్రైప్లై సాస్ ప్రో, ఫ్రేయా తదితర ఉత్పత్తులను ప్రదర్శించారు. లైవ్ కుక్-ఆఫ్‌లో ఎంపికైన 16 మంది క్రియేటర్లు పాల్గొన్నారు. హైదరాబాద్‌ను తమకు కీలకమైన మార్కెట్‌గా భావిస్తున్నామని వినోద్ కుక్‌వేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ (బిజినెస్ డెవలప్‌మెంట్) అర్జున్ అగర్వాల్ తెలిపారు. నగరంలో వినియోగదారులు, రిటైల్ భాగస్వాములతో ఉన్న సంబంధాలను మరింత విస్తరించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని చెప్పారు.

# ఉప్పల్ ప్రభుత్వ కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**ఉప్పల్, అక్టోబర్ 09, ప్రజా జ్యోతి** :ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉప్పల్ లో మహిళా సాధికారతా విభాగం, సాంస్కృతిక విభాగం ఆధ్వర్యం లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ వస్త్రధారణ లో పాల్గొని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సాధికారతా విభాగం సమన్వయకర్త డా.ఎన్ రాజశ్రీ, సాంస్కృతిక విభాగం సమన్వయకర్త జె.విశ్వనాథ్ కుమార్ సమన్వయం చేయగాకార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి జయ్ కుమార్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డా.కె.వి జయ్ కుమార్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని అన్నారు. ప్రకృతి ఆరాధన, మహిళల ఐక్యత, సామాజిక సౌహార్ద్రాన్ని ప్రతిబింబించే ఈ పండుగను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు విద్యార్థినులు బతుకమ్మ పాటలు పాడుతూ,



సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. కళాశాల ప్రాంగణం పూల సుగంధాలతో, జానపద గేయాలతో కళకళలాడింది. వివిధ రకాల పూలతో అలంకరించిన బతుకమ్మలను ప్రదర్శించి తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డా.సిహెచ్ సత్యనారాయణ డా.జి.తిరుపతయ్య, కె.గీత, డా.ఎస్ యమునారాణి, పి.విజయ్ కుమార్, డా.వి. శ్రీనివాసరావ్,



డా.ఆర్ చంద్రసాగర్డా, పి.వెంకటేశ్వర్లు, డా.సిహెచ్ అంజయ్య, కె. స్రవంతి, సిహెచ్ స్రవంతి, ఎల్ అనూష బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. బతుకమ్మలను సంప్రదాయ బద్ధంగా ఆడుతూ, తెలంగాణ సంస్కృతిపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. నల్లచెరువులో నిమజ్జనంతో వీడ్కోలు పలికారు.

# పూల బతుకమ్మ.. సంస్కృతికి పట్టుగొమ్మ!

### విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడిన చైర్‌పర్సన్ సమతా వెంకట్‌రెడ్డి

### మోడల్ స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**చేవెళ్ల అక్టోబరు 09(ప్రజా జ్యోతి):** తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలు.. వాటి చుట్టూ విద్యార్థినుల ఆటపాటలు.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే పాటలతో చేవెళ్ల తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ కాలేజీలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. పూల పండుగ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్‌రెడ్డి విద్యార్థినులతో కలిసి బతుకమ్మను పేర్చి, ఆటపాటల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్



సమతా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రకృతిని పూజిస్తూ, పూలను ఆరాధిస్తూ జరుపుకునే ఈ పండుగ మన సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెబుతుందని పేర్కొన్నారు. తెలంగాణ



సంస్కృతి వైభవాన్ని భావితరాలకు అందించడంలో ఇలాంటి వేడుకలు కీలకమన్నారు. విద్యార్థులు చదువుతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ, పురం దాస్, పాఠశాల ప్రిన్సిపాల్ అజ్రానా బేగం, 14వ వార్డు కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మొయినాబాద్ క్రిమినల్ కేసులు చేవెళ్ల కోర్టుకు బదిలీ

### సమయం, ఖర్చులు ఆదా అవుతుండటంపై ప్రజల్లో హర్షం

**మొయినాబాద్ : అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి)** మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రిమినల్ కేసులను చేవెళ్ల కోర్టు పరిధిలోకి మార్చడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయంతో న్యాయస్థానాలకు వెళ్లే ప్రజలకు ప్రయాణ ఇబ్బందులు తగ్గడంతో పాటు సమయం, ఖర్చులు ఆదా కానున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటివరకు మొయినాబాద్ ప్రాంతానికి సంబంధించిన సివిల్ కేసులు, ట్రాఫిక్ కేసులు, ఎక్సైజ్ (అబ్కారీ) కేసులు చేవెళ్ల కోర్టు పరిధిలో ఉండగా, క్రిమినల్ కేసులు మాత్రం రాజేంద్రనగర్ కోర్టు పరిధిలో ఉండేవి. దీంతో ఒకే వ్యక్తికి వేర్వేరు కేసులు ఉన్న సందర్భాల్లో రెండు ప్రాంతాల్లోని న్యాయస్థానాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడేది. దీనివల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. రెండు కోర్టుల చుట్టూ తిరిగే బాధ తప్పింది క్రిమినల్ కేసుల విచారణ కోసం రాజేంద్రనగర్ కోర్టుకు, ఇతర కేసుల కోసం చేవెళ్ల కోర్టుకు వెళ్లాల్సి రావడంతో



ప్రజలకు ప్రయాణ భారం పెరిగేది. అంతేకాకుండా వేర్వేరు కేసుల కోసం న్యాయవాదులను సంప్రదించాల్సిన పరిస్థితులు కూడా ఎదురయ్యేవి. దీంతో ఆర్థిక భారం పెరగడంతో పాటు విలువైన సమయం వృథా అయ్యేది. తాజాగా మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రిమినల్ కేసులను సైతం చేవెళ్ల కోర్టు పరిధిలోకి మార్చడంతో ఈ సమస్యలకు పరిష్కారం లభించనుందని ప్రజలు భావిస్తున్నారు. ఇకపై కేసులకు సంబంధించిన న్యాయపరమైన వ్యవహారాల కోసం చేవెళ్ల కోర్టును ఆశ్రయించే అవకాశం ఉండటంతో ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొంటున్నారు. ముఖ్యంగా ప్రజా రవాణాపై ఆధారపడే వారికి ఈ మార్పు ఎంతో ఉపయోగకరంగా మారనుంది. చేవెళ్ల కోర్టుకు వెళ్లేందుకు సాధారణంగా ఒకే బస్సులో ప్రయాణించే అవకాశం ఉండగా, రాజేంద్రనగర్ కోర్టుకు వెళ్లాలంటే మూడు బస్సులు మారాల్సి వచ్చేదని ప్రజలు చెబుతున్నారు. దీంతో ప్రయాణానికి ఎక్కువ సమయం పట్టడంతో పాటు అదనపు ఖర్చులు కూడా అయ్యేవని వివరిస్తున్నారు. క్రిమినల్ కేసులను చేవెళ్ల కోర్టు పరిధిలోకి మార్చడం వల్ల మొయినాబాద్ ప్రాంత ప్రజలకు న్యాయస్థానాలకు వెళ్లడం మరింత సులభతరం కానుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్పు ప్రజలకు సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా చేయడంలో దోహదపడుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు,

# తలకొండపల్లిలో భూ వివాదం..పరస్పర ఆరోపణలతో ఉద్రిక్తత

**తలకొండపల్లి,అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో సర్వే నెంబర్ 4లోని భూమి వివాదం రాజకీయ రంగు పులుముకుంది.తనకు తండ్రి నరసింహ నుండి సంక్రమించిన మూడున్నర కుంటల పట్టా భూమిని తాను 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నానని అంబటి సత్తయ్య తెలిపారు.పట్టా,పాస్ బుక్ తన వద్దే ఉన్నాయని,అయినా అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ వార్డు సభ్యుడు పుల్లారెడ్డి దశరథం తన అనుచరులతో కలిసి ఆ భూమిని తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు.తన పొలానికి ఉన్న కడీలను జేసీబీతో తొలగించారని,తాము కోర్టు నుండి స్టే తీసుకువచ్చామని, దాదాపు 20 సార్లు రెవెన్యూ సర్వేలో భూమి తమదేనని తేలిందని చెప్పారు.ప్రశ్నిస్తే తమ కుటుంబంపై ఎస్సీ,ఎస్టీ కేసులు పెడతామని బెదిరిస్తున్నారని,గత ఐదేళ్లుగా మానసికంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తనకు ప్రాణహాని ఉందని,తన భూమిని కాపాడాలని కోరుతూ ఎమ్మార్వో రమేష్ కుమార్ కి వినతిపత్రం అందజేశారు.



**బీఆర్ఎస్ నేతల స్పందన:**

ఈ ఆరోపణలపై బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా స్పందించారు.ఇది పూర్తిగా వ్యక్తిగత భూ వివాదమని,దీనికి రాజకీయ రంగు పులిమి తమ పార్టీ ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.రాజకీయంగా ఎదుర్కోలేక కక్షపూరితంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని,నిరాధార ఆరోపణలు



మానుకోవాలని హితవు పలికారు.భూ వివాదంపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఆధారాలతో రెవెన్యూ అధికారులను, కోర్టును ఆశ్రయించాలని,చట్టాన్ని గౌరవించాలని సూచించారు. ఆధారాలు లేకుండా వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగిస్తే లీగల్ గా నోటీసులు ఇస్తామని హెచ్చరించారు.ఈ వివాదంపై రెవెన్యూ అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి )** కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కళాశాల విద్యార్థినులు స్వయంగా బతుకమ్మలను తయారు చేసి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై సరళ, కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్‌తో పాటు అధ్యాపక బృందం పాల్గొన్నారు. విద్యార్థినులకు బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను వివరిస్తూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన అవసరాన్ని తెలియజేశారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొనడంతో కళాశాలలో బతుకమ్మ వేడుకలు సందడిగా



సాగాయి.ఈ నెల 10వ తేదీ నుంచి దసరా సెలవులుదసరా పండుగను పురస్కరించుకుని ఈ నెల 10వ తేదీ నుంచి కళాశాలకు దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి. పండుగను విద్యార్థులు సంతోషంగా, సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని కళాశాల వర్గాలు ఆకాంక్షించాయి.

# సెయింట్ పీటర్స్ కళాశాలలో జాతీయ స్థాయి హ్యాకథాన్ ప్రారంభం

### 'టెక్‌స్ప్రింట్ 2కే26'లో 90 బృందాల భాగస్వామ్యం




**మేడ్చల్, అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి):** హైదరాబాద్‌లోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ విభాగానికి చెందిన ఎలెక్స్పైర్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి 24 గంటల హ్యాకథాన్ 'టెక్‌స్ప్రింట్ 2కే26' శుక్రవారం ప్రారంభమైంది. అక్టోబర్ 9, 10 తేదీల్లో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 90 బృందాలు పాల్గొంటున్నాయి. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాలను రూపొందించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలు, సమస్యల పరిష్కార సామర్థ్యాన్ని పెంపొందించేలా పోటీలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాశి శ్రీవాస్తవ, గౌరవ అతిథిగా డాక్టర్ నవీన్ వద్దే హాజరయ్యారు. కళాశాల కార్యదర్శి టి.వి. రెడ్డి, విద్యా వ్యవహారాల సంచాలకురాలు టి. సరోజా రెడ్డి, పరిపాలనా సంచాలకుడు టి. అనురాగ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వెంకటరావు, ఉప ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ప్రసన్న కుమార్, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ కె. అమరేష్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమాజ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలు కనుగొనాలని అతిథులు సూచించారు. ఈ పోటీల ద్వారా బృంద సమన్వయం, సమయపాలన, నూతన ఆవిష్కరణల నైపుణ్యాలు పెంపొందుతాయని నిర్వాహకులు తెలిపారు.ం

# విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడమే సేవా సంకల్ప అభియాన్ లక్ష్యం

### గుండ్లపోచంపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు బహుమతుల ప్రదానం

**మేడ్చల్, అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి):** నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా గుండ్లపోచంపల్లి డివిజన్ అధ్యక్షుడు కావేరీ శ్రీధర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం గుండ్లపోచంపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ



కార్యక్రమానికి హాజరైన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అమరం మోహన్ రెడ్డి మాట్లాడుతూ సమాజ పురోగతికి విద్యార్థులే పునాదులని, వారిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. పాఠశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో పాటు క్రమశిక్షణతో రాణిస్తున్న విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సరైన ప్రోత్సాహం, అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించి, వారి ప్రతిభను వెలికితీయడమే సేవా సంకల్ప అభియాన్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి జైతువాలా కృష్ణ, చింతలపూడి రామారావు, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు బట్టికాడి నవనీత, నాయకులు అభిలాష్, విమలేష్ పాండే తదితరులు పాల్గొన్నారు.

# "రాజకీయాల్లో హుందాతనమే ముఖ్యం!"

### ఎమ్మెల్యే రంగారెడ్డిపై అసత్య ప్రచారాన్ని సహించం

### స్వార్థ రాజకీయాలకోసం మహిళలను కించపరచటం సమాజానికి సిగ్గుచేటు...

### సోషల్ మీడియా ప్రచారంపై స్పందించిన కావలి వెంకటరమణ



**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 9 ప్రజాజ్యోతి:** ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించిన అంశంలో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై కావలి వెంకటరమణ ముదిరాజ్ స్పందించారు.. తనకు కూతురి వయసున్న విద్యార్థినిపై ఇలాంటి పుకారులు రావటం చాలా బాధాకరణం అని అన్నారు. పూర్తి వాస్తవాలు తెలుసుకోకుండా ఒక ప్రజాప్రతినిధిపై ఆరోపణలు చేయడం, ఒక ఆడబిడ్డను అవమానపరిచే విధంగా చేస్తూ, వాటిని రాజకీయాలకు ఉపయోగించుకోవడం సరైన పద్ధతి కాదని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రజల మధ్య ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేస్తున్న ప్రజాప్రతినిధి అని, ఆయనపై ప్రచారమవుతున్న అంశాన్ని వాస్తవాల ఆధారంగా పరిశీలించాలని కోరారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి ప్రచారాన్ని నిజమని నమ్మి ఒకరి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వ్యవహరించడం తగదన్నారు. కేవలం రాజకీయ స్వార్థం కోసం ఇలాంటి ప్రచారాలు చేయటం సరికాదని మహిళల పై అసత్య ప్రచారాలు సమాజానికి మంచిదింకాదని కావలి వెంకటరమణ ముదిరాజ్ స్పష్టం చేశారు.

# దార్ల శ్రీనివాస్ ను వరించిన కళాసేవా ప్రతిభ అవార్డు-2026

## 25 ఏళ్ల జర్నలిజం ప్రస్థానానికి దక్కిన గౌరవం

**అబ్దుల్లాపూర్ మెట్టు, అక్టోబర్ 09 ( ప్రజాజ్యోతి ):** ప్రజా సమస్యలే అజెండాగా... బాధితుల గొంతుకే తన కలంగా మార్చుకుని గత 25 ఏళ్లుగా జర్నలిజం రంగంలో కొనసాగుతున్న సీనియర్ జర్నలిస్ట్ దార్ల శ్రీనివాస్ కు మరో ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించింది. సమాజంలో నెలకొన్న సమస్యలను తన వార్తా కథనాల ద్వారా వెలుగులోకి తీసుకురావడంతో పాటు, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్న ఆయన సేవలను గుర్తించి కళాసేవా ప్రతిభా అవార్డు--2026తో సత్కరించారు.

హైదరాబాద్‌లోని అలైడ్ ఆర్టిస్ట్స్ ఆడిటోరియంలో ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ 24వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. సంస్థ అధ్యక్షులు డాక్టర్ ఆలూరి విల్సన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన రచయిత, వ్యాఖ్యాత శోభన్‌బాబు, విశిష్ట అతిథులు, సినీ నటులు డాక్టర్ చింతకుంట మాణిక్‌రావు, సముద్రుడు మూవీ హీరో రమాకాంత్, సంస్థ ప్రతినిధులు, పలువురు ప్రముఖుల చేతుల మీదుగా దార్ల శ్రీనివాస్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు.





### సమస్య పరిష్కారం అయ్యేవరకు వెన్ను చూపని నైజం ఆయన సొంతం

రెండు దశాబ్దాలకు పైగా జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్న దార్ల శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో నివసిస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం వార్తా కథనాలు రాస్తున్నారు. రహదారులు, డ్రైనేజీ, విద్య, పారిశుద్ధ్యం, ప్రజా సౌకర్యాలు ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలతో పాటు సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన వార్తల ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం ఆయన జర్నలిజం ప్రస్థానంలో ప్రత్యేకతగా నిలుస్తోంది. సమాజంలో ఎక్కడ సమస్య కనిపించినా దానిని అధికారుల దృష్టికి తీసుకురావడంతో పాటు సమస్య పరిష్కారం అయ్యేవరకు తన వంతు కృషి చేయాలని తపనతో ఆయన పని చేస్తున్నారని కార్యక్రమ నిర్వాహకులు పేర్కొన్నారు. జర్నలిజాన్ని కేవలం వృత్తిగా కాకుండా సామాజిక బాధ్యతగా భావిస్తూ ప్రజల పక్షాన నిలవడం ఆయనకు ఈ పురస్కారం దక్కడానికి ప్రధాన కారణాలలో ఒకటిగా వారు పేర్కొన్నారు.



### వరుసగా ప్రతిష్టాత్మక పురస్కారాలు

దార్ల.శ్రీనివాస్ జర్నలిజం రంగంలో అందిస్తున్న సేవలకు ఇప్పటికే పలు పురస్కారాలు లభించాయి 2025 సంవత్సరంలో సికింద్రాబాద్ లోని క్లాసికల్ గార్డెన్ లో ఉగాది పురస్కారం అందుకున్నారు. అదే ఏడాది సెప్టెంబర్ లో శ్రీ విరాట్ విశ్వకర్మ విజ్ఞాన ఆధ్యాత్మిక ధార్మిక కళాపరిషత్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో విశ్వకర్మ ఐకాన్ జాతీయ గౌరవ పురస్కారం అందుకున్నారు. అనంతరం 2026 సంవత్సరంలో వరంగల్ లో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ పురస్కారం అందుకున్నారు. అనంతరం భారత్ రక్తదానం సేవ మిషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరులో బెస్ట్ సోషల్ సర్వీస్ ఎక్సలెన్స్ అవార్డు -2026,తాజాగా ప్రజా సమస్యలపై ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా కళాసేవ ప్రతిభ అవార్డు- 2026 లభించడం ఆయన 25 ఏళ్ల జర్నలిజం ప్రస్థానంలో మరో మైలురాయిగా నిలిచింది.

### ప్రజా సమస్యల్ని వెలికితీయడంలో దార్ల శ్రీనివాస్ కృషి అభినందనీయం

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ 25 ఏళ్లుగా జర్నలిజం వృత్తిలో కొనసాగడం సాధారణ విషయం కాదన్నారు. జర్నలిజం వృత్తి కత్తి మీద సాము లాంటిదని వార్తలు సేకరణ కోసం పగలు రాత్రి అనే తేడా లేకుండా పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నో ఆటుపోట్లు సవాళ్లు అడ్డంకులను అధిగమిస్తూ ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో దార్ల శ్రీనివాస్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సమాజంలో సమస్యలను గుర్తించి వాటిపై వార్తలు వ్రాస్తూ ప్రజలకు అధికార యంత్రాంగానికి మధ్య వారధిగా నిలుస్తున్న దార్ల శ్రీనివాస్ కు తమ చేతులమీదుగా పురస్కారం అందించడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో జర్నలిజం రంగంలో మరింతగా రాణించి మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

### కళా సామాజిక సేవలకు వేదికగా ఆలూరి సంస్థ

ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ కలలు సాహిత్యం సామాజిక సేవా రంగాల్లో సేవలందిస్తున్న ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించడంలో తనదైన పాత్ర పోషిస్తున్న సంస్థ 24వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన పలువురికి పురస్కారాలు అందజేయడం ద్వారా వారి సేవలకు గుర్తింపు కల్పించింది. ఈ వేదికపై దార్ల శ్రీనివాస్ కు కళాసేవ ప్రతిభ అవార్డు -2026 అందించడం ఆయన 25 ఏళ్ల జర్నలిజం ప్రస్తానానికి ప్రజా సమస్యలపై సాగిస్తున్న నిరంతర కలం పోరాటానికి మరో గౌరవ గుర్తింపుగా నిలిచింది. ఈ సందర్భంగా దార్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు డాక్టర్ ఆలూరి విల్సన్ వెలుగులోకి రాని ఎందరో కళాకారులను తమ సంస్థ ద్వారా వారి కళలను గుర్తించి కళాకారులను వెలుగులోకి తీసుకు వస్తున్న వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ పురస్కారం అందుకోవడం తనపై మరింత బాధ్యతను పెంచిందని, ఇదే స్ఫూర్తితో సమాజంలో నెలకొన్న సమస్యలపై తన కలంతో నిరంతరం పోరాటం కొనసాగిస్తానని తెలిపారు.

# జర్నలిస్టుల హక్కులు.. సంక్షేమమే లక్ష్యం!

**టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నేతలు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, సలీం పాషా**

**టీయూడబ్ల్యూజే (ఐజేయూ) చేవెళ్ల ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా నరేందర్‌రెడ్డి ఏకగ్రీవం**

**చేవెళ్ల అక్టోబర్ 09(ప్రజా జ్యోతి):** టీయూడబ్ల్యూజే (ఐజేయూ) చేవెళ్ల నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా పడమటి నరేందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం చేవెళ్లలోని జీపీఆర్ ఫామ్‌హౌస్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సలీం పాషా మాట్లాడుతూ.. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు అందించడంతోపాటు ఇళ్ల స్థలాల సాధనకు పోరాడుతామని పేర్కొన్నారు.









### నూతన కార్యవర్గం ఎన్నిక

నూతన కార్యవర్గం అధ్యక్షులుగా నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా గోంగుపల్లి రాఘవేందర్, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మహేష్, శ్రీకాంత్ కార్యదర్శులుగా వామన్‌రెడ్డి, శ్రీకాంత్, కోశాధికారిగా ఈపూరి రాఘవేంద్ర ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రవణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా ఇస్మాయిల్, రమేష్, శివ, సుధాకర్, శివారెడ్డి, ముస్తఫా, బిక్షపతి ఎన్నికయ్యారు. జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సంతోష్, జిల్లా కమిటీ సభ్యుడిగా మల్లేష్ ఎంపికయ్యారు. నూతన అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకులకు, జర్నలిస్టు మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు శ్రీశైలం, టీయూడబ్ల్యూజే చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడు యాదయ్య, కార్యదర్శి గోపాల్, షాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ధర్పల్లి రవీందర్‌గౌడ్, జిల్లా నాయకులు కరుణాకర్ చారి, దర్శనాల కృష్ణ, సంతోష్‌కుమార్ చారి, మల్లేష్ గోపాల్‌రావు, వికారాబాద్ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు కుమ్మరి రాఘవేందర్, వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. చేవెళ్ల నియోజకవర్గ రిపోర్టర్లు పూర్ణచందర్, రాజేష్, చంద్రశేఖర్, వినయ్‌తో పాటు పలువురు జర్నలిస్టులు హాజరయ్యారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం

## బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన

**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 9(ప్రజా జ్యోతి )** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లినియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పట్టభద్రుడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను పరిశీలించుకొని, అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదయ్యేలా సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నే రాజు, డీసీసీ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కుత్బుల్లాపూర్ ప్రజల ఆరోగ్య రక్ష ...మన ఎమ్మెల్యే, బిఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ.వివేకానంద్ : మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు

**క్యాన్సర్ తో బాధపడుతున్న వ్యక్తికి మూడు విడతల్లో 10 లక్షల విలువ గల ఎల్వోసీ మంజూరు... మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకుల చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేత**

**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 9(ప్రజా జ్యోతి )** 130 – సుభాష్ నగర్ డివిజన్ సూరారం కు చెందిన కొడవాటి లక్ష్మీ నర్సింహ తండ్రి కె.శ్రీనివాస్ రావు గత కొన్నేళ్లుగా క్యాన్సర్ తో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ బాధితుడికి మెరుగైన వైద్యాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మొదటి విడతగా రూ.3,00,000/- లక్షలు, రెండవ విడతగా రూ.4,00,000/- లక్షలు మంజూరు కాగా తాజాగా మూడవ విడతగా రూ.3,00,000/- లక్షల రూపాయలను మంజూరు చేయించారు. కాగా చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకుల చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు ఎల్ఓసి పత్రాలను అందజేశారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్ ప్రజల ఆరోగ్య రక్షకులు, ప్రజల బాగోగుల కోసం ప్రతీ క్షణం పనిచేసే నాయకులు మన ఎమ్మెల్యే, బిఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ.వివేకానంద్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, కట్టా సుందర్, సుకుమార్, విజయ్, ప్రభాకర్, శివ గౌడ్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఐదో ఏడాది కేఎల్‌ఈఎఫ్‌కు ఐఐసీ 4-స్టార్ రేటింగ్



**హైదరాబాద్, అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి) :** కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ వరుసగా ఐదో ఏడాది ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్(ఐఐసీ) అత్యున్నత 4-స్టార్ రేటింగ్ సాధించినట్లు యూనివర్సిటీ చాన్స్‌లర్ ఇంజినీర్ కోనేరు సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024--25 సంవత్సరానికి కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్ ప్రకటించిన ఈ గుర్తింపుతో పాటు, కేఎల్‌ఈఎఫ్‌కు చెందిన ఏడు విద్యార్థి బృందాలు ఫైనల్స్‌కు చేరాయని తెలిపారు. వీటిలో నాలుగు బృందాలు ఏఐసీటీఈ ప్రొడక్షన్ ఫెలోషిప్(ఏపీఎఫ్), మూడు బృందాలు యుక్తి ఇన్నోవేషన్ ఛాలెంజ్‌కు ఎంపికయ్యాయని తెలిపారు. ఆరు బృందాలు హానర్స్ త్రూ ఇన్నోవేషన్(హెచ్.టీ.ఐ) కార్యక్రమానికి చెందినవని చెప్పారు. ఈ కార్యక్రమాలు డా.జి.పార్థసారథి వర్మ నాయకత్వంలో, ఎండీఐఅండ్ఈ విభాగాధిపతి డా.కె.నరసింహరాజు పర్యవేక్షణలో అధ్యాపకులు, సిబ్బంది సహకారంతో కొనసాగుతున్నాయని తెలిపారు.

ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ

# బతుకమ్మ పండుగను నవ సమాజానికి చాటి చెపుదాం

**బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు లట్టుపల్లి రమాదేవి**

**తలకొండపల్లి,అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక,ఆడబిడ్డల ఆత్మగౌరవానికి నిదర్శనం బతుకమ్మ పండుగ అని బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు లట్టుపల్లి రమాదేవి అన్నారు.బతుకమ్మ పండుగ సందర్భంగా తలకొండపల్లి,అమనగల్,కడ్తాల్,మాడ్గుల్ మండలాలలోని మహిళలందరికీ ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...తెలంగాణ ఆడపడుచులు తొమ్మిది రోజుల పాటు పూల బతుకమ్మలతో, ఆటపాటలతో జరుపుకునే ఈ పండుగకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు.బతుకమ్మ సంబరాలు ప్రతి ఇంటా సంతోషాలను నింపాలని,మహిళల జీవితాల్లో ఆనందం,ఆరోగ్యం,ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బతుకమ్మ పండుగకు అంతర్జాతీయ గుర్తింపు వచ్చిందని,మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో మహిళల పాత్ర కీలకమని అన్నారు.బతుకమ్మ పండుగ వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటాలని వారు పిలుపునిచ్చారు.



# ఐజీ విగ్రహం వద్ద ట్రాఫిక్ కష్టాలకు పరిష్కారం.. సర్కిల్ అభివృద్ధికి మార్కింగ్ పూర్తి!

**అల్వాల్ అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి)** ఇందిరా గాంధీ విగ్రహం వద్ద ట్రాఫిక్ సమస్యలను తగ్గించి, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించే లక్ష్యంతో సర్కిల్ అభివృద్ధికి చర్యలు చేపట్టారు. మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోట లక్ష్మీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం జీహెచ్‌ఎంసీ అధికారుల సమక్షంలో సర్కిల్ అభివృద్ధి పనులకు సంబంధించి మార్కింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ మహేష్, ఏఈ అరుణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు రామారావు, చందు, కాంగ్రెస్ సర్కిల్ నాయకులు బి. నాగేశ్వరరావు, బల్వంత్ రెడ్డి, గణేష్, సాయిరాం గౌడ్, శరత్ గౌడ్, ఓం ప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఇందిరా గాంధీ విగ్రహాన్ని నూతనంగా ఏర్పాటు చేయడంతో పాటు, సర్కిల్‌ను వెనక్కి జరిపి వాహనాల రాకపోకలకు ఆటంకాలు కలగకుండా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ మార్పులతో సర్కిల్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గి, వాహనాల రాకపోకలు మరింత సజావుగా సాగేందుకు అవకాశం ఉంటుందని నాయకులు పేర్కొన్నారు. ఈ పనులను అతి త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమానికి సహకరించి, మంజూరు చేయించిన మైనంపల్లి హనుమంతరావుకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. సర్కిల్ అభివృద్ధి పూర్తయితే స్థానిక ప్రజలకు, వాహనదారులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# అక్షర స్కూల్ వాహన డ్రైవర్ నిర్లక్ష్యం.. వాహన దారులకు ఇబ్బంది..పట్టించుకోని పోలీసులు

**కూకట్ పల్లి అక్టోబర్ 9(ప్రజా జ్యోతి )** కూకట్ పల్లి చిత్తరమ్మ తల్లి ఆలయం సమీపంలోని అక్షర స్కూల్ వాహనాలు ఇష్టానుసారంగా ప్రయాణిస్తూ స్థానికులకు, వాహన దారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. అస్తవ్యస్తంగా ప్రయాణిస్తూ డ్రైవర్లు, అందులో పనిచేసే సిబ్బంది ఎదురుగా వచ్చే వాహన దారులపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. ఆ స్కూల్ కు సంబంధించిన వాహనాలకు సరైన అనుమతులు లేవంటూ స్థానికులు వాపోతున్నారు. వాహనం నడిపే డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ ఇతర అనుమతి పత్రాలు పరిశీలించే అధికారులు కారువడం తో ప్రైవేట్ స్కూల్ డ్రైవర్ ల ఆగడాలు కొనసాగుతున్నాయి. విద్యాశాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది చర్యలు లేకపోవడంతో డ్రైవర్లు ఆడిందే ఆటగా పాడింది పాటగా నడుస్తున్నాయి. అక్షర స్కూల్ డ్రైవర్లు నిర్లక్ష్యంగా వాహనాలు నడపడంతో ఎప్పుడు ఎక్కడ ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందో నన్న భయాందోళనలతో రోడ్లపై నడిచే వాహనదారులు, పాదాచార్యులు ఆందోళన పడుతున్నారు .ఉన్నతాధికారులు పూనుకొని అస్తవ్యస్తంగా ప్రయాణించే వాహనాలను సరైన పత్రాలు లేని పాఠశాల వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నారు.



# తెలంగాణలో డిజిటల్ సేవలు చివరి వ్యక్తి వరకు పంపిణీ

**బలోపేతం చేస్తున్న భారత తపాలా శాఖ.. ఆర్థిక సేవల విస్తరణ**

**ఒకే తపాలా వ్యవస్థ, అపరిమిత అవకాశాలు"– ప్రజలకు అందుబాటులో ఉండే, సాంకేతికత ఆధారిత సేవలు అందించడమే లక్ష్యం: సీపీఎంజీ డీఎస్వీఆర్ మూర్తి**

**ప్రతి నెలా 20 లక్షల మంది చేయూత పింఛన్ లబ్ధిదారులకు సేవలు.. 263 ఆధార్ కేంద్రాల ద్వారా పౌర సేవలు**

**17 విడతల రోజ్‌గార్ మేళాల ద్వారా 1,86,202 నియామక పత్రాల అందజేత.. తెలంగాణ ప్రాంతంలో 1,272 మంది అభ్యర్థుల ఎంపిక**



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** అక్టోబర్ 9 ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా నేటి నుంచి ఈ నెల 15 వరకు జాతీయ తపాలా వారోత్సవాలను తపాలాశాఖ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని డాక్ సదన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ (సీపీఎంజీ) డీఎస్వీఆర్ మూర్తి మాట్లాడారు. భారత తపాలాశాఖ సాధించిన విజయాలు,సాంకేతిక పురోగతి, పౌరులకు మెరుగైన సేవలు అందించేందుకు చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ.. 1874లో యూనివర్సల్ పోస్టల్ యూనియన్ (యూపీయూ) ఏర్పాటైన సందర్భంగా ప్రపంచ తపాలా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఒకే తపాలా వ్యవస్థ–అపరిమిత అవకాశాలు అనే ఇతివృత్తాన్ని ఎంపిక చేసినట్లు చెప్పారు. తపాలా కార్యాలయాల ద్వారా విస్తృత సేవలను కొనసాగిస్తూనే,ఆధునిక సాంకేతికతతో ప్రజలకు మెరుగైన సేవలు అందించే సంస్థగా భారత తపాలాశాఖ అభివృద్ధి చెందుతున్న తీరును ఈ నినాదం ప్రతిబింబిస్తుందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో 1,49,385 కార్యాలయాలతో సహా మొత్తం 1,64,999 తపాలా కార్యాలయాలతో ప్రపంచంలోనే అతిపెద్ద తపాలా వ్యవస్థను ఇండియా పోస్టు నిర్వహిస్తోందని చెప్పారు. తెలంగాణ సర్కిల్ పరిధిలో 36 ప్రధాన పోస్టాఫీసులు, 759 సబ్ పోస్టాఫీసులు, 5,424 బ్రాంచ్ పోస్టాఫీసులు పనిచేస్తున్నాయని.. ఈ వ్యవస్థలో 6,514 మంది శాఖా ఉద్యోగులు, 10,623 మంది గ్రామీణ డాక్ సేవకులు (జీడీఎస్) భాగస్వామ్యులుగా ఉంటూ.. గ్రామీణ, పట్టణ, మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు నిత్యావసర సేవలను అందిస్తున్నారని ఆయన వివరించారు. ఉపాధి కల్పన గురించి ప్రస్తావిస్తూ.. 17 విడతల రోజ్‌గార్ మేళా ద్వారా తపాలా శాఖ మొత్తం 1,86,202 నియామక ఉత్తర్వులను జారీ చేసిందని, ఇందులో 1,51,348 మంది గ్రామీణ డాక్ సేవకులు ఉన్నారని తెలిపారు. తెలంగాణ సర్కిల్‌లో 1,123 మంది గ్రామీణ డాక్ సేవకులతో సహా మొత్తం 1,272 మంది అభ్యర్థులు ఉద్యోగ నియామకాలను పొందారని ఆయన పేర్కొన్నారు.జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా యూపీయూ అంతర్జాతీయ లేఖా రచన పోటీ 2026లో తెలంగాణ సర్కిల్ తరపున విజేతలుగా నిలిచిన వారికి మూర్తి బహుమతులు అందజేశారు. తపాలా శాఖ అందిస్తున్న విభిన్న సేవలు, చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించేలా జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య ఎం సింధియా, కమ్యూనికేషన్లశాఖ సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని నాయకత్వంలో తపాలా శాఖ సేవల పంపిణీని మెరుగుపరచడం,నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంపొందించడం వంటి చర్యలు చేపడుతోందని శ్రీ మూర్తి వివరించారు. అదే సమయంలో ప్రజలకు సేవలందించాలనే కీలక బాధ్యతను కూడా కొనసాగిస్తోందని పేర్కొన్నారు. గతంలో ఉత్తరాలు, పోస్టుకార్డుల ద్వారా ద్వారా సమాచారాన్ని చేరవేసే రోజులు ఉండేవని, ప్రస్తుతం ఎస్ఎంఎస్, వాట్సాప్, ఈ–మెయిల్ వంటి ఆధునిక మార్గాలు అందుబాటులోకి వచ్చాయని శ్రీ మూర్తి గుర్తుచేశారు. సమాచార అనుసంధానంలో సాంకేతిక పరిజ్ఞానం ఎన్నో మార్పులు తీసుకొచ్చినప్పటికీ, వ్యక్తుల మధ్య వ్యక్తిగత అనుబంధాలకు ఉన్న విలువ మాత్రం అలాగే కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. మారుతున్న సమాచార అవసరాలకు అనుగుణంగా భారత తపాలాశాఖ తన సేవలను నిరంతరం అభివృద్ధి చేసుకుంటూనే.. ప్రజలను అనుసంధానించడం, వారికి అవసరమైన సేవలను అందించడం అనే తన దీర్ఘకాలిక లక్ష్యానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. డిజిటల్ గా వచ్చిన మార్పుల గురించి చెబుతూ... స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన సాంకేతిక వేదిక అయిన ఏపీటీ 2.0 ప్రారంభం కావడం ఓ ముఖ్యమైన



విజయమని అన్నారు. ఐఐటీ హైదరాబాద్, ఇస్రోకు చెందిన జాతీయ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్సీ) సహకారంతో అభివృద్ధి చేసిన డిజిపిన్ (డిజిటల్ పోస్టల్ ఇండెక్స్ నంబర్)... ప్రామాణికమైన 10 అక్షరాలతో కూడిన జియో––కోడెడ్ ఆధారిత డిజిటల్ చిరునామా నిర్దేశాన్ని అందిస్తుంది. బట్వాడా సేవల గురించి శ్రీ మూర్తి వివరిస్తూ... డోర్ స్టెప్ సర్వీస్ (డీఎస్ఎస్) అప్లికేషన్ ద్వారా డెలివరీలను ఎప్పటికప్పుడు ట్రాక్ చేయవచ్చని తెలిపారు. 2026 మార్చి 17న హైదరాబాద్‌లో 24 స్పీడ్ పోస్ట్, 48 స్పీడ్ పోస్ట్ సేవలు ప్రారంభమయ్యాయి.వీటి ద్వారా 1.33 లక్షలకు పైగా వస్తువులు నమోదయ్యాయని వెల్లడించారు. 94 పిన్ కోడ్ ప్రాంతాలకు నిర్దిష్ట సమయంలో డెలివరీ అందిస్తున్నామని పేర్కొన్నారు. పోస్టాఫీసు కౌంటర్లలో యూపీఐ, కార్డు చెల్లింపుల సౌకర్యం కూడా అందుబాటులో ఉందని, డీఎస్ఎస్ అప్లికేషన్ ద్వారా 'క్యాష్ ఆన్ డెలివరీ (సీవోడీ)' విధానంలో సేవల్ని అందిస్తున్నట్లు తెలిపారు.

## జనప్రియలో రూ.7 కోట్ల ఆర్‌యూబీ పనులకు వేగం.. త్వరగా పూర్తి చేయాలి: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**అల్వాల్ అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి)** జనప్రియ ప్రాంతంలో కొనసాగుతున్న రోడ్ అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణ పనులను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్మాణ పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.జనప్రియ పరిసర ప్రాంతాల్లో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ సమస్యలు తగ్గేలా ఆర్‌యూబీ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దాదాపు రూ.7 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న ఈ పనులు పూర్తయితే ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని తెలిపారు.ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను ప్రాధాన్యతతో చేపట్టి, పనుల్లో అనవసర జాప్యం జరగకుండా చూడాలని ఆయన అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో అనిల్ కిషోర్ గౌడ్, డోలి రమేష్, పవన్, నర్ల సురేష్, మధుసూదన్ రెడ్డి, రాజు, సులోచన, హరిత తదితరులు పాల్గొన్నారు.

## 23వ రోజుకు చేరిన తెలంగాణ ఉద్యమకారుల దీక్షలు.. హామీల అమలుపై ప్రభుత్వానికి గట్టి డిమాండ్!



**అల్వాల్ అక్టోబర్ 9(ప్రజా జ్యోతి)** తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను కాలయాపన చేయకుండా తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు 23వ రోజుకు చేరుకున్నాయి. హామీల అమలులో జాప్యం చేయకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని దీక్షా శిబిరం వేదికగా నాయకులు డిమాండ్ చేశారు.23వ రోజు నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో ఉద్యమకారులు పి. ముత్యాలు, శ్యామ్ కుమార్, రషీద్ పాల్గొని దీక్షకు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఉద్యమకారులకు మద్దతుగా పటోళ్ల సురేందర్ రెడ్డి, పుట్నాల కృష్ణ, దయాకర్, మంద శోభన్, అనంతుల సంతోష్, డోలి సుధీర్, శేరుపల్లి మల్లేష్, శ్రీనివాస్ గౌడ్, యాదగిరి, సంగమేశ్వర్, రమేష్ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ఉందని వారు పేర్కొన్నారు. హామీల అమలుపై ఇకనైనా కాలయాపన చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, ఉద్యమకారులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

# క్యూర్ పరిధిలోని భౌరంపేట్ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి నూతన భవన నిర్మాణానికి నిధుల మంజూరు

**నిర్మాణ ప్రణాళికపై ఉపాధ్యాయులతో చర్చించిన మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి**

**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 9(ప్రజా జ్యోతి )** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం క్యూర్ పరిధిలో ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించిన నిధులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ పరిధిలోని భౌరంపేట్ ప్రభుత్వ పాఠశాలలో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాఠశాలను సందర్శించి, నూతన భవన నిర్మాణానికి సంబంధించిన అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా




పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి భవన నిర్మాణ విధానం, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పన తదితర అంశాలపై చర్చించారు. పాఠశాల అవసరాలు, విద్యార్థుల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. నూతన భవనం అందుబాటులోకి వస్తే విద్యార్థులకు మెరుగైన వసతులతో కూడిన విద్యా వాతావరణం కల్పించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.అనంతరం దసరా సెలవులను పురస్కరించుకుని పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలను నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు

## గుడ్డుతో సంపూర్ణ పోషణ.. ఆరోగ్యమే మన లక్ష్యం:ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**అల్వాల్ అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి)** ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు సమతుల్య ఆహారంలో గుడ్డుకు ప్రాధాన్యత ఇవ్వాలని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ గుడ్డు దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మల్కాజ్‌గిరిలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి సంవత్సరం అక్టోబర్‌లో రెండవ శుక్రవారం ప్రపంచ గుడ్డు దినోత్సవాన్ని నిర్వహిస్తారని పేర్కొన్న ఎమ్మెల్యే, గుడ్డులో శరీరానికి అవసరమైన ప్రోటీన్లు, విటమిన్లు తదితర పోషకాలు సమృద్ధిగా ఉంటాయని తెలిపారు. పిల్లలు, యువతతో పాటు పెద్దలు కూడా తమ రోజువారీ ఆహారంలో గుడ్డును భాగంగా చేసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలను పొందవచ్చని వివరించారు.ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పోషకాహారంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని ఆయన అన్నారు. తగిన మోతాదులో గుడ్డును ఆహారంలో చేర్చుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రజలకు సూచించారు."ఆరోగ్యకరమైన రేపటి కోసం గుడ్డుతో పోషణ.. ప్రతిరోజూ గుడ్డు తిందాం, ఆరోగ్యంగా జీవిద్దాం" అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సన్ ఫుడ్స్ గ్రూప్ ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# నిరుపేద చిన్నారికి అండగా నిలిచిన మాజీ జడ్పీటీసి పట్నం అవినాష్ రెడ్డి

**షాబాద్ అక్టోబర్ 9 ( ప్రజాజ్యోతి )** ఓ నిరుపేద చిన్నారికి షాబాద్ మాజీ జడ్పీటీసి పట్నం అవినాష్ రెడ్డి అండగా నిలిచారు. షాబాద్ మండలంలోని మాచనపల్లి గ్రామానికి చెందిన బైండ్ల స్పర్శ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతుంది. చిన్నారి తండ్రి యాదయ్య గత మూడేళ్ల క్రితం మరణించాడు. రెండు రోజుల క్రితం పాఠశాలలో ఉపాధ్యాయులు నిర్వహించిన పరీక్షలో నీవు దేవుని ఏదైనా కోరిక కోరుకో అని ప్రశ్న అడగగా... అందులో చిన్నారి నాకు మా నాన్న కావాలని సమాధానం రాయడంతో సోషల్ మీడియా ద్వారా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి వెళ్లడంతో వెంటనే స్పందించిన కేటీఆర్ షాబాద్ మాజీ జడ్పీటీసి పట్నం అవినాష్ రెడ్డి తో మాట్లాడి చిన్నారి వివరాలు తీసుకోవాలని సూచించారు. దీంతో శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలో అవినాష్ రెడ్డి నివాసంలో చిన్నారిని పిలిపించి వివరాలు తెలుసుకున్నారు. త్వరలో కేటీఆర్ దగ్గరికి తీసుకెళ్లి చిన్నారికి సహాయం అందించేలా తమవంతు కృషి చేస్తామని అవినాష్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాచనపల్లి సర్పంచ్ రాధ, మాజీ సర్పంచ్ మహేందర్ రెడ్డి, నాయకులు గోపాల్, గ్రామస్తులు, తదితరులున్నారు.



# ఉనికిని కాపాడుకోవడానికి వాస్తవాలను వక్రీకరిస్తారా

**అబ్దుల్లాపూర్ మెట్టు,అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి)** రాజకీయంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని ఎదుర్కొనే సత్తా లేక తమ ఉనికిని కాపాడుకునేందుకు వాస్తవాలను వక్రీకరించి బిఆర్ఎస్ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం ఆయనపై బురదజల్లే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని కో ఆప్షన్ సభ్యులు గౌస్ భాయ్ బిఆర్ఎస్ పార్టీ నాయకులపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళల కోసం మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఈ పథకంపై మహిళలు ఏ విధంగా లబ్ధి పొందుతున్నారు అనే విషయాన్ని తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి బొంగులూరు నుండి ఇంజాపూర్ వరకు బస్సులో ప్రయాణం చేస్తూ మహిళలు ఇంజనీరింగ్ విద్యార్థులతో మాట్లాడడం జరిగింది. ఈ క్రమంలో వారు మహాలక్ష్మి పథకం ద్వారా తమకు ఎంతో లబ్ధి చేకూరుతుందని వేల రూపాయలు ఆదా అవుతున్నాయని తెలియజేయడం జరిగింది. ఈ క్రమంలో బస్సులో ఎమ్మెల్యే ఒక అమ్మాయిని తన కూతురుగా భావించి ఆప్యాయంగా పలకరిస్తూ చనువుగా మాట్లాడుతున్న వీడియోను జీర్ణించుకోలేని బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎడిట్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ రాక్షసానందం పొందడం సిగ్గుచేటు అన్నారు. రాజకీయంగా విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో సహజమేనని, మహిళలు విద్యార్థులను రాజకీయ కక్ష సాధింపులకు ఆయుధంగా వాడుకోవడం సరైన పద్ధతి కాదని ఆయన హితవు పలికారు. పచ్చకామెర్లు ఉన్న వాళ్లకు లోకమంతా పచ్చగానే కనిపిస్తుందని, ఇలాంటి ఆరోపణలు మీ దిగజారుడు రాజకీయాలకు ప్రతిబింబంగా ఉన్నాయన్నారు. ప్రజా సమస్యలపై ఆరోపణలు చేస్తే తాము ఆహ్వానిస్తామని, ఇలాంటి చిల్లర రాజకీయాలు భవిష్యత్తులో పునరావృతం అయితే ప్రజలే తన్ని తరిమి కొడతారని ఆయన హెచ్చరించారు. ఒక నియోజకవర్గానికి ఎమ్మెల్యే నియోజకవర్గంలోని ప్రజలందరికీ వారి ఆలనా పాలన చూసే తండ్రి లాంటి వాడు అని.ఒక విద్యార్థిని తన కూతురుగా భావించి ఆప్యాయంగా చనువుగా దగ్గరకు తీసుకొని మహాలక్ష్మి పథకం గురించి వారి అభిప్రాయాలను తీసుకుంటుంటే ఆ బంధాన్ని కూడా నీచపు బుద్ధితో చూడదం సిగ్గుచేటని గౌస్ భాయ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.



# హోలీ స్పిరిట్ హైస్కూల్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**రంగురంగుల పూలతో బతుకమ్మల అలంకరణ..**
**సంప్రదాయ పాటలతో విద్యార్థినుల సందడి**

**షాబాద్, అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి):** షాబాద్ మండలం లోని హోలీ స్పిరిట్ హైస్కూల్‌లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని పాఠశాలలో వేడుకలను ఉత్సాహభరిత వాతావరణంలో జరుపుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థినులు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణం అంతా బతుకమ్మ పాటలతో, విద్యార్థులు సందడితో కళకళలాడింది.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ సంగీత నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ



ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఇలాంటి పండుగల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో మన సంస్కృతి పట్ల గౌరవం, సంప్రదాయాలపై అవగాహనతో పాటు ఐక్యతా భావం పెంపొందుతుందని పేర్కొన్నారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని భావితరాలకు పరిచయం



చేయడంలో పాఠశాలల్లో నిర్వహించే ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొని బతుకమ్మ సంబరాలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

# ప్లాస్టిక్‌కు బదులు స్టీల్..!

**మున్సిపాలిటీలో 'ప్లేట్ బ్యాంకు' ఏర్పాటు చేయాలి**
**మోడల్ స్కూల్ విద్యార్థిని వినూత్న ప్రతిపాదన**
**చైర్‌పర్సన్‌కు వినతిపత్రం.. సానుకూలంగా పరిశీలిస్తామని హామీ**

**చేవెళ్ల, అక్టోబరు 9 (ప్రజా జ్యోతి):** చిన్న వయసులోనే పర్యావరణ పరిరక్షణపై వినూత్నంగా ఆలోచించింది ఓ విద్యార్థిని. శుభకార్యాలు, విందుల్లో ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగాన్ని తగ్గించేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 'స్టీల్ ప్లేట్ బ్యాంకు' ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. చేవెళ్ల పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న ఎర్త్ లీడర్ జి. లక్ష్మీ తేజ.. బతుకమ్మ సంబరాల సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా రెడ్డికి ఈ మేరకు వినతిపత్రం అందజేసింది.

**ప్లాస్టిక్‌తో పర్యావరణానికి హాని**

పట్టణంలో జరిగే శుభకార్యాలు, విందుల్లో ప్లాస్టిక్ ప్లేట్లను



విరివిగా వినియోగిస్తున్నారని లక్ష్మీ తేజ పేర్కొంది. వాడిన ప్లేట్లను ఇష్టానుసారంగా పడేయడంతో భూకాలుష్యం పెరుగుతోందని, వాటిని కాల్చడం వల్ల వాయుకాలుష్యం ఏర్పడుతోందని వివరించింది. ప్లాస్టిక్ వ్యర్థాలను తిని మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. వేడి ఆహారాన్ని ప్లాస్టిక్ ప్లేట్లలో తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని తెలిపింది.

**తక్కువ అద్దెకు స్టీల్ ప్లేట్లు**

ఈ సమస్యకు పరిష్కారంగా మున్సిపాలిటీలో స్టీల్ ప్లేట్ బ్యాంకును ఏర్పాటు చేయాలని సూచించింది. పట్టణ ప్రజలు శుభకార్యాలు, ఇతర వేడుకల కోసం తక్కువ అద్దెకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు తీసుకునేలా ఏర్పాట్లు చేయాలని కోరింది. కార్యక్రమం పూర్తయ్యాక వాటిని శుభ్రం చేసి తిరిగి అప్పగించే విధానాన్ని అమలు చేయాలని పేర్కొంది. దీనివల్ల ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించడంతోపాటు మున్సిపాలిటీకి ఆదాయం సమకూరుతుందని వివరించింది.

**చిన్నారి ఆలోచనపై చైర్పర్సన్ హర్షం**

లక్ష్మీ తేజ ప్రతిపాదనపై చైర్‌పర్సన్ దేవర సమతా రెడ్డి స్పందిస్తూ.. చిన్న వయసులోనే పర్యావరణ పరిరక్షణపై బాధ్యతతో ఆలోచించడం అభినందనీయమని పేర్కొన్నారు. స్టీల్ బ్యాంకు ఏర్పాటుపై సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. సీజీఆర్ పర్యావరణ సంస్థ స్ఫూర్తితో, ప్రిన్సిపాల్ ఎస్. అఙ్రానా, తల్లిదండ్రుల సహకారంతో ఈ ఆలోచన చేసినట్లు విద్యార్థిని తెలిపింది.ఈ కార్యక్రమంలో ఎంఈఓ పురం దాస్, పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. అఙ్రానా, మెంటర్ టీచర్ డా. మహేశ్వర్ రావు, ఉపాధ్యాయులు షాహీన, తండభాని, మల్లేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్, వార్డు కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్, తాళ్లపల్లి నర్సింలు, ఎర్త్ లీడర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భారతదేశం విదేశాలలోని పర్యాటక ప్రాంతాలను ఒకచోట చేర్చుతూ ప్రారంభమైన టిటిఎఫ్

**టిటిఎఫ్ హైదరాబాద్‌లో బతుకమ్మ వేడుకల పోస్టర్ విడుదల**
**పెద్ద సంఖ్యలో ఈ వేడుకలలో పాల్గొనాల్సిందిగా ఆహ్వానించిన పర్యాటక శాఖ మంత్రి**

శేరిలింగంపల్లి:అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి): భారతదేశంలోని అత్యంత పురాతన, అతిపెద్ద ట్రావెల్ ట్రేడ్ షో నెట్‌వర్క్‌లో భాగమైన టిటిఎఫ్ హైదరాబాద్ 2026, ఈరోజు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లోని హాల్ 2లో ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే ఈ ప్రదర్శన కోసం పర్యాటక గమ్యస్థానాలు, ఆతిథ్య రంగ సంస్థలు,ట్రావెల్ వ్యాపార సంస్థలు ఒకచోటకు చేరాయి.ఈ ప్రదర్శనలో వాణిజ్య సమావేశాలు, వినియోగదారులతో అనుసంధానిత కార్యక్రమాలు కూడా జరగనున్నాయి.ఫెయిర్‌ఫెస్ట్ మీడియా ద్వారా నిర్వహించబడుతున్న ఈ 2026 ఎడిషన్‌లో, ఏడు రాష్ట్ర పర్యాటక బోర్డులతో సహా 15కు పైగా భారత రాష్ట్రాలు, ఏడు దేశాల నుండి 150కు పైగా ఎగ్జిబిటర్లు పాల్గొంటున్నారు.ఇది 5,000కు పైగా ట్రావెల్ ట్రేడ్ నిపుణులను ఆకర్షిస్తుందని అంచనా.ఈ ప్రదర్శన విహార,తీర్థయాత్ర,సామూహిక,కార్పొరేట్, మైస్ ప్రయాణాలకు సంబంధించిన గమ్యస్థానాలు, ఆతిథ్య ఉత్పత్తులు, ప్రయాణ సేవలు, ప్రయాణ సాంకేతికతను అందిస్తుంది.తెలంగాణ



ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక,పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, జమ్మూ ఌ కాశ్మీర్ ముఖ్యమంత్రి సలహాదారు నాసిర్ అస్లాం వనీ, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరు,ఐఏఎస్, తెలంగాణ ప్రభుత్వ పర్యాటక శాఖ డైరెక్టర్ ఎల్. రంజీత్ నాయక్, ఐఎఫ్ఎస్, ట్రావెల్ ట్రేడ్ పరిశ్రమకు చెందిన సీనియర్ ప్రతినిధులతో కలిసి టిటిఎఫ్ హైదరాబాద్ 2026ను ప్రారంభించారు.ఈ ప్రదర్శనలో ఫీచర్ కంట్రీగా థాయ్‌లాండ్,హోస్ట్ స్టేట్‌గా తెలంగాణ టూరిజం ఉన్నాయి.జమ్మూ ఌ కాశ్మీర్ గోవా భాగస్వామ్య రాష్ట్రాలుగా ఉండగా,మహారాష్ట్ర, గుజరాత్,ఢిల్లీ,పంజాబ్ ఫీచర్ స్టేట్స్‌గా ఉన్నాయి.ఈ రాష్ట్రాలు తమ గమ్యస్థానాలను, వాటికి చెందిన ప్రైవేట్ రంగ భాగస్వాములతో కలిసి ప్రదర్శిస్తున్నాయి.అంతర్జాతీయంగా థాయ్‌లాండ్, శ్రీలంక, మలేషియా,సింగపూర్, ఇండోనేషియా,మాల్దీవులు,కంబోడియా ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నాయి.ఫెయిర్‌ఫెస్ట్ మీడియా చైర్మన్ ఌ సీఈఓ సంజీవ్ అగర్వాల్ మాట్లాడుతూ... ప్రస్తుతం ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలకు ప్రయాణాలు దెబ్బతిన్నాయి,కానీ భారతీయ ప్రయాణికులు ప్రయాణించడం ఆపలేదు. వారు భారతదేశంలోనే, సమీప గమ్యస్థానాలకు ప్రయాణిస్తున్నారు, అలా ప్రయాణించినప్పుడు ఎక్కువ ఖర్చు కూడా చేస్తున్నారు. ఏడు రాష్ట్ర పర్యాటక బోర్డులు, ఏడు దేశాలతో కూడిన టీటీఎఫ్ హైదరాబాద్‌లోని ఈ వేదిక, ఆ డిమాండ్ ఎక్కడ ఉందో ప్రత్యక్షంగా ప్రతిబింబిస్తోంది. దక్షిణ భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న సోర్స్ మార్కెట్లలో హైదరాబాద్ ఒకటి. ఇక్కడి వ్యాపారులు ప్రస్తుతం పండుగ,శీతాకాలం కోసం కొనుగోలు చేస్తున్నారుఅని అన్నారు.ప్రారంభోత్సవ రోజున ప్రదర్శన ప్రాంగణంలో సందడి నెలకొంది, ప్రదర్శనకారులు హైదరాబాద్, తెలంగాణ, పొరుగు ప్రాంతాలకు చెందిన ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు,కొనుగోలుదారులతో సమావేశమయ్యారు.స్కాల్ ఇంటర్నేషనల్ హైదరాబాద్,హైదరాబాద్ నుంచి ప్రపంచానికి: తెలంగాణ భారత్‌లో తదుపరి గ్లోబల్ టూరిజం పవర్‌హౌస్‌గా మారగలదా అనే చర్చా కార్యక్రమాన్ని నిర్వహించింది.నవంబర్ 2026లో ప్లాట్‌ఫామ్ ప్రారంభానికి ముందు,విహారి ఓటీటీ తమ సత్య వియత్నాం సిరీస్ ప్రివ్యూను ప్రదర్శించింది. దీనిలో టెలివిజన్ ప్రముఖుడు సత్య నటించారు.

# బతుకమ్మ పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ ప్రియాంక అలా



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** టీజీవో హైదరాబాద్ జిల్లా బతుకమ్మ పోస్టర్ని రిలీజ్ చేసిన గౌరవ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా ఐఏఎస్ చేతుల మీదుగా పోస్టర్ రిలీజ్ చేయడం జరిగింది కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ మహిళలు బతుకమ్మ పండుగ ని గొప్పగా జరుపుకుంటారని సంప్రదాయాలను గౌరవిస్తూ ముందుకు వెళ్తారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ట్యాగ్ హైదరాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఏంజులా రెడ్డి సరస్వతి వందన మమత జ్యోతి సంధ్య ఈ కార్యక్రమానికి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం బి కృష్ణ యాదవ్. కార్యదర్శి ఎం ఏ ఖాదర్.బి ఆశన్న వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# టాటా అరియా షోరూమ్ లో ప్రారంభించిన కొండ విజయ్ కుమార్



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** ప్రముఖ సామాజిక సేవకుడు, హోప్ ఫౌండేషన్ చైర్మన్, గోల్డ్ మ్యాన్ గా పేరొందిన కొండ విజయ్ కుమార్ బాచుపల్లిలోని టాటా మోటార్స్ షోరూంలో నూతన టాటా కార్ (ఆరిస్/కర్వ్) ను రిబ్బన్ కట్ చేసి ఘనంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొండ విజయ్ కుమార్ ను టాటా షోరూం యాజమాన్యం పూలమాలలతో ఘనంగా స్వాగతించారు.కార్ పై పూలమాల వేసి, కొబ్బరికాయ కొట్టి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండ విజయ్ కుమార్ మాట్లాడుతూ... హోప్ ఫౌండేషన్ ద్వారా 2015 నుండి నిరంతరం అన్నదానం,విద్య, వైద్య సేవలు అందిస్తున్నాము.ఎలాంటి విరాళాలు తీసుకోకుండా సొంత ఖర్చులతోనే సేవ చేస్తున్నాము. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం మా లక్ష్యం అని అన్నారు.ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు, టాటా మోటార్స్ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# బతుకమ్మతో సంప్రదాయాలకు జీవం!

**ప్రిన్సిపల్ నరసింహారెడ్డి**
**శ్రీ సాయి చైతన్య, ప్రజ్ఞాత స్మార్ట్ కిడ్స్‌లో ఘనంగా బతుకమ్మ సంబురాలు**





**చేవెళ్ల, అక్టోబరు (ప్రజా జ్యోతి):** విద్యార్థులకు చదువుతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేయాలని శ్రీ సాయి చైతన్య ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ నరసింహారెడ్డి అన్నారు. సంప్రదాయాలను భావితరాలకు అందించడమే నిజమైన వారసత్వమని పేర్కొన్నారు. శుక్రవారం శ్రీ సాయి చైతన్య ఉన్నత పాఠశాల, ప్రజ్ఞాత స్మార్ట్ కిడ్స్ పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చిన విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఆటపాటలతో పాఠశాలల్లో పండుగ సందడి నెలకొంది. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఐక్యతను పెంపొందించడంతోపాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై గౌరవాన్ని పెంచుతాయని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల విద్యార్థులు పాల్గొన్నారు.

# తమ భూమిని కాజేసేందుకు బ్లాక్ మెయిల్ చేస్తుర్రు

**స్టేటస్ కో ఉన్నా పట్టించుకోవడం లేదు**
**తమకు న్యాయం చేయాలనీ బాధితుల ఆవేదన**




**శామీర్ పేట్, అక్టోబర్ 09,(ప్రజాజ్యోతి)** జగన్‌గూడ గ్రామ రెవెన్యూ పరిధిలో తమకు చెందిన 33 గుంటల భూమిని కాజేసేందుకు కొందరు రాజకీయ నాయకులు బ్లాక్ మెయిల్ చేస్తూ కుట్రలు పన్నుతున్నారని జకముకల హనుమంతరెడ్డి, జకముకల వీరారెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఉమ్మడి శామీర్‌పేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ......మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి మున్సిపాలిటీలోనీ జగన్ గూడ లో 1996లో కొనుగోలు చేసిన భూమికి 1927 నాటి సర్వే వివరాలతో పాటు పాత పన్నులు, విద్యుత్ బిల్లుల ఆధారాలు ఉన్నాయని బాధితులు తెలిపారు. కోర్టు ఆదేశాలు పొందినప్పటికీ తమకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫెన్సింగ్ కోసం తెచ్చిన రాళ్లు, కడీలను బావిలో పడేసి, బావిని పూడ్చివేశారని ఆరోపించారు. సంబంధిత అధికారులు పాత రికార్డులను పరిశీలించి, సమగ్ర విచారణ జరిపి తమ భూమికి రక్షణ కల్పించాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

# పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

రూ.17 వేల జరిమానా.. బాధితురాలికి రూ.2 లక్షల పరిహారం

**అబ్దుల్లాపూర్ మెట్టు అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి)** పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్‌లోని ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం తీర్పునిచ్చినట్లు నాగోల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ తెలిపారు. నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో 2020లో నమోదైన క్రైమ్ నంబర్ 1173/2020 కేసులో నిందితుడు గుంజి కోటేశ్వరరావు (28)కు న్యాయస్థానం ఈ శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

**కేసు వివరాలివీ..**

నిందితుడు గుంజి కోటేశ్వరరావుపై ఐపీసీ సెక్షన్లు 366, 376(2)( ఎన్ ), 342, 493, 506తో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 5(ఎల్) రెడ్ విత్ 6 కింద కేసు నమోదైంది. ఈ కేసు విచారణ అనంతరం ఎల్బీనగర్‌లోని అత్యాచారం, పోక్సో కేసుల విచారణకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫాస్ట్‌ట్రాక్ న్యాయస్థానం నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.17 వేల జరిమానా విధించింది. బాధితురాలికి రూ.2 లక్షల పరిహారం అందించాలని ఆదేశించింది.

**పోలీసుల కృషి..**

ఈ కేసు దర్యాప్తులో అప్పటి ఎల్బీనగర్ ఇన్‌స్పెక్టర్ వి.అశోక్‌రెడ్డి, ఏసీపీ పి. శ్రీధర్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు డి.రఘు, పి.సత్యనారాయణ, కృష్ణప్రసన్న వాదనలు వినిపించారు. కేసు విచారణలో పోలీసు సిబ్బంది, సంబంధిత అధికారులు ప్రాసిక్యూషన్‌కు సహకరించారు. ఈ మేరకు నాగోల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ వివరాలు వెల్లడించారు.



# బొడ్డెమ్మలతో సందడి..తలకొండపల్లిలో పండుగ శోభ

విద్యార్థినీల ఆటపాటలతో మార్మోగుతున్న పాఠశాలలు

బతుకమ్మకు ముందే తలకొండపల్లి మండలంలో పండుగ సందడి





**తలకొండపల్లి,అక్టోబర్ 08 (ప్రజాజ్యోతి):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల్లో పండుగ సందడి మొదలైంది.విద్యార్థినీలు ఆటపాటలు,పూల పరిమళాలతో పాఠశాలల వాతావరణాలు కొత్త కళను సంతరించుకుంటోంది.తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు అద్దం పట్టే బొడ్డెమ్మ,బతుకమ్మ, పెద్ద పండుగ,దసరా పండుగలను ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.పండుగల పరంపరలో ముందుగా బొడ్డెమ్మను కొలుచుకోవడం ఆనవాయితీగా వస్తోంది.దసరా సెలవుల సందర్భంగా శుక్రవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో వివిధ గ్రామాల్లో ఉన్న ప్రవేట్ పాఠశాలలో విద్యార్థినీలు అంతా ఒకచోట చేరి బొడ్డెమ్మను ఏర్పాటు చేసి,పసుపు కుంకుమలతో పూజలు చేస్తున్నారు.అనంతరం బొడ్డెమ్మ చుట్టూ తిరుగుతూ సంప్రదాయ పాటలు పాడుతూ ఆటలు ఆడుతుంటే బతుకమ్మ పల్లె వాకిళ్లు సందడిగా మారిపోతున్నాయి.చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొంటారు.ఒకరి పాటకు మరొకరు గొంతు కలుపుతూ,చప్పట్లు కొడుతూ బొడ్డెమ్మ ఆడే దృశ్యాలు పల్లె సంస్కృతికి అద్దం పడుతున్నాయి.ఎక్కడ చూసినా నవ్వులు,పాటలు,ఆటలతో పండుగ వాతావరణం కనిపిస్తోంది.

**తరతరాలుగా వస్తున్న సంప్రదాయం:**

బొడ్డెమ్మ కేవలం పండుగ మాత్రమే కాదు..తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు,కుటుంబ అనుబంధాలకు,పల్లె సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోంది.పెద్దలు పాటలు పాడుతుంటే చిన్నారులు వాటిని నేర్చుకుంటూ ఈ సంప్రదాయాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు.మారుతున్న కాలంలోనూ పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలను ఆడపడుచులు, చిన్నారులు భక్తిశ్రద్ధలతో కొనసాగించడం విశేషం.బొడ్డెమ్మతో మొదలయ్యే ఈ పండుగల సందడి..బతుకమ్మ, దసరా వరకు కొనసాగనుంది.దీంతో తలకొండపల్లి మండలంలో పూల పరిమళం..పాటల మాధుర్యం.. ఆడపడుచుల ఆటపాటలతో పండుగ శోభ వెల్లివిరుస్తోంది.

# రోడ్డు విస్తరణలో పాఠశాల భవనం కోల్పోయినా.. చదువుకు ఆటంకం లేకుండా చర్యలు!

రుద్రారం ప్రభుత్వ పాఠశాలకు అద్దె భవనం ఏర్పాటు

వాలంటీర్ వేతనం తానే చెల్లిస్తానన్న సర్పంచ్ యాదిరెడ్డి

త్వరలో సొంత పాఠశాల భవనం నిర్మిస్తాం: ఎమ్మెల్యే కాలె యాదయ్య





**షాబాద్, అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి):** రోడ్డు విస్తరణలో పాఠశాల భవనం కోల్పోవడంతో విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా రుద్రారం గ్రామ సర్పంచ్ యాదిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గ్రామంలోని ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న చిన్నారుల కోసం అద్దె భవనాన్ని ఏర్పాటు చేసి, తరగతుల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాఠశాల కొనసాగింపునకు ఆయన ముందుకు రావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**వాలంటీర్ వేతనం సర్పంచ్ భరోసా**

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలనే లక్ష్యంతో పాఠశాలలో ఉపాధ్యాయుడు నర్సింలుతో పాటు మరో ఉపాధ్యాయురాలు, ఒక వాలంటీర్‌ను ఏర్పాటు చేశారు. వాలంటీర్‌కు ప్రతినెలా చెల్లించాల్సిన వేతనాన్ని తానే భరిస్తానని సర్పంచ్ యాదిరెడ్డి హామీ ఇచ్చారు. ఐదో తరగతి వరకు చదువుతున్న చిన్నారుల విద్యాభివృద్ధికి గ్రామస్తులందరూ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

**పాఠశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే**

ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అద్దె భవనంలో ఏర్పాటు చేసిన పాఠశాలను ప్రారంభించి, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, పాఠశాల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు విస్తరణ కారణంగా పాఠశాల భవనం కోల్పోయిన నేపథ్యంలో విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా తాత్కాలికంగా అద్దె భవనాన్ని ఏర్పాటు చేయడంపై స్పందించారు.

**త్వరలో సొంత భవనం నిర్మాణం**

రుద్రారం ప్రభుత్వ పాఠశాలకు త్వరలోనే సొంత భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కాలె యాదయ్య గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. కొత్త భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు విద్యార్థుల చదువుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల హాజరు పెంపు, నాణ్యమైన విద్య అందించేందుకు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. పాఠశాల నిర్వహణకు సర్పంచ్ యాదిరెడ్డి ముందుకు రావడం, సొంత భవన నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆశలు చిగురించాయి.

# రుద్రారం ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు ఉచిత ఆటల దుస్తులు పంపిణి

గ్రామంలో రేషన్ కార్డులు

ఉచిత హెల్మెట్లు పంపిణీ

ఎమ్మెల్యే కాలే యాదయ్య

రుద్రారం గ్రామ సర్పంచ్ యాదిరెడ్డి



**షాబాద్ అక్టోబర్ 09 ( ప్రజా జ్యోతి )** రుద్రారం గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో గ్రామ సర్పంచ్ యాదిరెడ్డి ఆధ్వర్యంలో 35 మంది విద్యార్థులకు ఉచితంగా ఆటల దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, ఎంఈఓ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమంలో పిసరి సురేందర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెంటారెడ్డి, ఎంఈఓ లక్ష్మణ్, ఎంపీడీఓ అపర్ణ, మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, సర్పంచులు గుత్తి చెన్నయ్య, శ్రీనివాస్ రెడ్డి, నర్సింలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చేవెళ్ల స్వామి, బండ కృష్ణ, దేవునిగడ్డ మల్లేష్, లాయర్ ప్రభాకర్ పాఠశాల ఉపాధ్యాయుడు నర్సింలు, మహిళా సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించి భవిష్యత్తులో గ్రామానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. గ్రామ సర్పంచ్ యాదిరెడ్డి మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో విద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన సహకారం అందించడం ద్వారా వారి చదువుతో పాటు క్రీడా ప్రతిభను ప్రోత్సహించవచ్చన్నారు. గ్రామంలో అందరికీ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఉచిత హెల్మెట్లు పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్ యాదిరెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, ప్రతి ఒక్కరికి ఉచిత హెల్మెంటు పంపిణీ చేసినట్లు తెలిపారు యువత ఎలిమెంట్ లేనిది, మైనర్ పిల్లలకు బండి ఇచ్చినచో తల్లిదండ్రులపై క్రిమినల్ కేసులో అవుతాయని ఎమ్మెల్యే కాలేదా తెలిపారు దీనిపై ప్రతి ఒక్కరూ ఆవేర్నస్ ప్రోగ్రాం చేస్తున్నమని తెలిపారు, యువత ఎలిమెంట్ లేనిది. బయటికి బండి పైన రావ్వకూడదని ఆయన పిలుపునిచ్చారు

# ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన రాగం నాగేందర్ యాదవ్





**శేరిలింగంపల్లి, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ ఎన్నికల సందర్భంగా హెచ్ టి యు డిపోలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని గౌరవ అధ్యక్షులు, శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ సందర్శించారు.ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించి, యూనియన్ నాయకులు, కార్మికులతో మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని, కార్మికుల ఐక్యతే యూనియన్ బలమని తెలిపారు.అనంతరం డిపోలో కార్పొరేటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వయంగా కార్మికులకు, సిబ్బందికి ఆహారాన్ని వడ్డించారు.ఈ కార్యక్రమంలో డిపో ప్రెసిడెంట్ టి.మనోహర్, డిపో సెక్రటరీ వై.ఎస్.బసప్ప, తెలంగాణ ఆర్.టీ.సీ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి,చీఫ్ అడ్వైసర్ లు మహేష్ గౌడ్, ప్రసాద్,ట్రెజరర్ రవి కుమార్,కమిటీ మెంబర్స్ రవి,మల్లేశం,ఏం శ్రీశైలం,నర్సింలు, శ్రీశైలం,అనిల్ భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతిలో బతుకమ్మ.. దసరా సందడి

అమ్మవారి వేషధారణలో అలరించిన చిన్నారి




**చేవెళ్ల అక్టోబర్ 09(ప్రజా జ్యోతి):** పామెనలోని సంస్కృతి పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ, దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయబద్ధంగా సంబరాలు జరుపుకున్నారు. దుర్గాదేవి తొమ్మిది రూపాల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఏ. శశిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు పండుగల విశిష్టతను తెలియజేయడంతోపాటు సంప్రదాయాలపై అవగాహన పెంచుతాయని పేర్కొన్నారు. వేడుకల్లో భాగస్వాములైన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు.

# బేవరేజెస్ కార్పొరేషన్‌కు అనుకూలంగా తీర్పు

**శేరిలింగంపల్లి,అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):**



ఉమ్మడి రాష్ట్రంలో ఇన్ కామ్ టాక్స్ డిపార్ట్‌మెంట్ 2007లో ఆరు సంవత్స రాలకు సంబంధించిన ఇన్ కామ్ టాక్స్ పన్నులను రూ. 544 కోట్ల ను బేవరేజెస్ కార్పొరేషన్ చెల్లించాలని ఇన్ కామ్ టాక్స్ డిపార్ట్మెంట్ కోర్టులో కేసు వేశారు.రూ. 544 కోట్లలో తెలంగాణ టీజీబీసీఎల్ రూ.226 కోట్లు చెల్లించాలని ఇన్ కామ్ టాక్స్ డిపార్ట్‌మెంట్ కేసులో పేర్కొంది. ఈ కేసును తెలంగాణ అడ్వకేట్ జనరల్ ఏ. సుదర్శన్ రెడ్డి వాదించారు.అడ్వకేట్ జనరల్ వాదనలు విన్న హైకోర్టు తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ కు ఈ కేసులో హైకోరు అనుకూలంగా తీర్పు వచ్చింది. రూ.226 కోట్లను ఇన్ కామ్ టాక్స్ డిపార్ట్ మెంట్‌కు టీజీబీసీఎల్ చెల్లించాల్సిన అవసరం లేదని హైకోర్టు తీర్పు వెలువరించింది.బేవరేజెస్ కార్పొరేషన్‌కు అనుకూలంగా తీర్పు వచ్చిన సందర్భంగా తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ జనరల్ ఏ.సుదర్శన్‌రెడ్డిని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్, టీజీబీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సి.హరికిరణ్ మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.కమిషనర్ వెంట అసిస్టెంట్ కమిషనర్ (హెడ్‌కార్టర్స్) శీలం శ్రీనివాస రావు టీజీబీసీఎల్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ బి.ఆంశా ఉన్నారు.

# మచ్చలేని ఎమ్మెల్యే పై దుష్ప్రచారం తగదు

మండలం కాంగ్రెస్ మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ

ఎమ్మెల్యే పై తప్పుడు ఆరోపణలు మానుకోవాలి.



**యాచారం, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి బస్సులో ప్రయాణిస్తూ ప్రజలతో మాట్లాడిన దృశ్యాలను కొంతమంది వక్రీకరించి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని మండలం కాంగ్రెస్ మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణ యాదవ్ ఆరోపించారు.అక్టోబర్ 6న కలెక్టరేట్ కార్యక్రమం అనంతరం బొంగ్లూర్ గేటు వద్ద ప్రయాణికుల కష్టసుఖాలు తెలుసుకునేందుకు ఎమ్మెల్యే ఆర్టీసీ బస్సులో ప్రయాణించారని తెలిపారు. బస్సులో తన కూతురుతో సమానం గల యువతితో మాట్లాడిన దృశ్యాలను వక్రీకరించి ట్రోలింగ్ చేయడం సరికాదన్నారు. రాజకీయ విమర్శలకు అంశాలు లేకపోవడంతోనే ఇలాంటి దుష్ప్రచారాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలను మానుకోవాలని గజ్జి రామకృష్ణ యాదవ్ హెచ్చరించారు.. ఏదైనా అభివృద్ధి గురించి మాట్లాడాలి ప్రజలకు ఉపయోగం జరిగేలా మాట్లాడాలి అంతే గాని ఏలాంటి మచ్చలేని మా నాయకుని పైన దురుప్రచారం చేస్తే ఊరుకునేది లేదు నియోజకవర్గం లో కూడా తిరుగకుండా ప్రజలే మీకు బుద్ధి చెప్తారు అని గజ్జి రామకృష్ణ యాదవ్ ౹=ా నాయకులను హెచ్చరించారు

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com

# మొయినాబాద్ మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, బీమా సౌకర్యాలు కల్పించాలి



**మొయినాబాద్: అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి)** మొయినాబాద్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ మొయినాబాద్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అల్లి దేవేందర్ మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికులకు సమయానికి వేతనాలు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్మికులకు వెంటనే ఈఎస్ఐ కార్డులు, పీఎఫ్ నంబర్లు, నూతన యూనిఫారాలు అందించాలని కోరారు. వారాంతపు సెలవులు అమలు చేయడంతోపాటు జీవో 60 ప్రకారం కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలని, ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని అధికారులను డిమాండ్ చేశారు.
విధి నిర్వహణలో మున్సిపల్ కార్మికులు అనేక ప్రమాదాలకు గురవుతున్నందున రాష్ట్ర ప్రభుత్వం వారికి బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. జీహెచ్ఎంసీ కార్మికులకు చెల్లిస్తున్న వేతనాలను మున్సిపల్ కార్మికులకు కూడా చెల్లించాలని కోరారు. ఒకే విధమైన పనులు చేస్తున్నప్పటికీ వేతనాల్లో వ్యత్యాసాలు ఉండటం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మున్సిపల్ యూనియన్ సీఐటీయూ అధ్యక్షుడు ముంజగల రత్నం, ప్రధాన కార్యదర్శి సుధాకర్, సురేష్‌తో పాటు పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

# సీఎంసీ యూనిసెఫ్ ఇండియా చైల్డ్-ఫ్రెండ్లీ సేఫ్ సైబరాబాద్‌పై దృష్టి





**శేరిలింగంపల్లి, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్,యూనిసెఫ్ ఇండియా సహకారంతో సీఎంసి ప్రధాన కార్యాలయంలో జూనియర్ సిటిజన్స్:ఏ చైల్డ్-ఫ్రెండ్లీ అండ్ సేఫ్ సైబరాబాద్ అంశంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది. సైబరాబాద్‌ను పిల్లలకు మరింత సురక్షితమైన, సమగ్ర మరియు అనుకూలమైన నగరంగా అభివృద్ధి చేయడానికి సీఎంసీ ప్రతిపాదిస్తున్న దృష్టికోణం, కార్యాచరణ విధానంపై సమావేశంలో వివరంగా చర్చించారు.
ఈ సమావేశానికి యూనిసెఫ్ ఇండియా డిప్యూటీ రిప్రజెంటేటివ్ (ప్రోగ్రామ్స్) జెస్పర్ మోలర్, యూనిసెఫ్ ఇండియా చీఫ్ ఆఫ్ ఫీల్డ్ సర్వీసెస్ సోలెడాడ్ హెర్రెరో,యూనిసెఫ్ హైదరాబాద్ చీఫ్ ఆఫ్ ఫీల్డ్ ఆఫీస్ డాక్టర్ జెలాలెమ్ బి. టాఫెస్సే, యూనిసెఫ్ హైదరాబాద్ చైల్డ్ ప్రొటెక్షన్ స్పెషలిస్ట్ సోనీకుట్టి జార్జ్ హాజరయ్యారు.సీఎంసీ కమిషనర్ డాక్టర్ జి. శ్రీజన, ఐఏఎస్, అదనపు కమిషనర్ శ్రీమతి వి.వి.ఎల్. సుభద్రా దేవి, ఐఎఫ్ఎస్, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, వివిధ శాఖల అధిపతులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు. కమిషనర్ చైల్డ్-ఫ్రెండ్లీ,సేఫ్ సైబరాబాద్ కోసం సీఎంసీ రూపొందిస్తున్న దృష్టికోణం, ప్రతిపాదిత విధానాన్ని వివరించారు.పిల్లలు,కిశోరులను జూనియర్ సిటిజన్స్‌గా గుర్తిస్తూ,నగర ప్రణాళిక, అభివృద్ధిలో వారి అవసరాలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకునే విధంగా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు వివరించారు. వీధులు, పార్కులు, పాఠశాలలు, ప్రజా ప్రదేశాలు,రవాణా, ప్రాథమిక సేవలు, భద్రత వంటి అంశాల్లో పిల్లలకు అనుకూలమైన విధానాలను ప్రవేశపెట్టడం ఇందులో భాగంగా ఉంటుంది.ప్రతిపాదిత జూనియర్ సిటిజన్స్ కార్యక్రమంలో శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ మూడు జోన్లలో పిల్లలతో క్రమబద్ధమైన సంప్రదింపులు,వారి అభిప్రాయాల సేకరణకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. పాఠశాలలకు సురక్షిత మార్గాలు,పాదచారుల మౌలిక వసతులు, పార్కులు, ప్రజా ప్రదేశాలు, నీరు--పారిశుధ్యం,రవాణా,కమ్యూనిటీ భద్రత వంటి అంశాల్లో పిల్లల సూచనలను పరిగణనలోకి తీసుకునేలా ప్రతిపాదనలు రూపొందించారు. పిల్లల భాగస్వామ్యాన్ని ఒక్కసారి నిర్వహించే కార్యక్రమంగా కాకుండా నిరంతర సంస్థాగత ప్రక్రియగా కొనసాగించాల్సిన అవసరాన్ని కమిషనర్ వివరించారు. పిల్లల నుంచి సేకరించిన సూచనలను జూనియర్ సిటిజన్స్ చార్టర్ ఆఫ్ ఆస్క్స్ రూపంలో రూపొందించి, వాటిని వార్డు ప్రణాళికలు, బడ్జెట్ ప్రతిపాదనలు, శాఖల కార్యాచరణ ప్రణాళికల్లో పరిగణనలోకి తీసుకునే విధానాన్ని ప్రతిపాదించారు. తీసుకున్న చర్యలపై పిల్లలకు తిరిగి సమాచారం అందించే విధానం కూడా ఇందులో ఉంటుంది.
పిల్లల భాగస్వామ్యం, సమగ్రత, భద్రత,పారదర్శకతతో పాటు సీఎంసీ శాఖలు, పాఠశాలలు, కుటుంబాలు, కమ్యూనిటీ సంస్థల మధ్య సమన్వయానికి సమావేశంలో ప్రాధాన్యత ఇచ్చారు.పట్టణ ప్రణాళిక, పార్కులు--ప్రజా ప్రదేశాలు,రవాణా, పౌర సేవలు, పాఠశాలలు,భద్రత వంటి అంశాల్లో చైల్డ్ ఇంపాక్ట్ను పరిగణనలోకి తీసుకునే విధానంపై కూడా దృష్టి సారించారు.ఈ కార్యక్రమంలో భాగంగా చైల్డ్ రైట్స్ సెక్రటేరియట్ సెల్‌ను సీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్, సీఎంసీ, యూనిసెఫ్ ప్రతినిధుల సమక్షంలోప్రారంభించారు. సైబరాబాద్‌లో బాలల హక్కులు, చైల్డ్-ఫ్రెండ్లీ పట్టణ పరిపాలనకు సంబంధించిన కార్యక్రమాలను నిరంతరం సమన్వయం చేయడానికి ఈ సెల్ ఒక సంస్థాగత వేదికగా పనిచేయనుంది.

# పూల పండుగ బతుకమ్మ.. తెలంగాణ సంస్కృతికి ప్రతీక!

నారాయణ పాఠశాలలో సంప్రదాయాల సందడి.. ఆటపాటలతో విద్యార్థినుల ఉత్సాహం

బతుకమ్మ విశిష్టతను వివరించిన ప్రిన్సిపాల్ కుముదవల్లి, ఏజీఎం హేమంబర్

**అబ్దుల్లాపూర్ మెట్టు , అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను వనస్థలిపురంలోని నారాయణ పాఠశాల శాఖలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం రంగురంగుల పూలతో కళకళలాడగా.. సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబైన విద్యార్థినులు, ఉపాధ్యాయినులు వివిధ రకాల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు, ఆటపాటలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది.

**ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ**

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, మహిళల ఐక్యతకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పాఠశాల ప్రిన్సిపాల్ కుముదవల్లి తెలిపారు. పూలను పూజిస్తూ ప్రకృతిలోని అందాలను ఆరాధించడం, కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంతో ఆనందాన్ని పంచుకోవడం ఈ పండుగ ప్రత్యేకత అని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

**విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలు పెంపొందించాలి**

బతుకమ్మ వేడుకలు విద్యార్థులకు కేవలం ఆటపాటల కార్యక్రమం మాత్రమే కాదని, తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను ప్రత్యక్షంగా తెలుసుకునే గొప్ప అవకాశమని ఏజీఎం హేమంబర్ వివరించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చడం ద్వారా ప్రకృతిపై ప్రేమ, పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన పెరుగుతాయని తెలిపారు. సమష్టిగా వేడుకల్లో పాల్గొనడం ద్వారా ఐకమత్యం, పరస్పర గౌరవం, సహకారం వంటి విలువలు అలవడతాయని పేర్కొన్నారు.
విద్యార్థులు ఆధునిక విద్యతోపాటు తమ మూలాలను, మాతృభూమి సంస్కృతిని కూడా తెలుసుకోవాలని, మన పండుగల వెనుక ఉన్న ఆచారాలు, ఆలోచనలు, సామాజిక సందేశాలను అర్థం చేసుకోవాలని సూచించారు. పాఠశాల స్థాయిలో ఇటువంటి వేడుకలు నిర్వహించడం ద్వారా చిన్నతనం నుంచే విద్యార్థుల్లో మన సంప్రదాయాల పట్ల గౌరవభావం పెంపొందుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏజీఎం హేమంబర్, ప్రాంతీయ ఇన్‌చార్జి రవి ప్రసాద్,



ప్రిన్సిపాల్ కుముదవల్లి, ఈ-చాంప్స్ పరిశోధన, అభివృద్ధి విభాగాధిపతి మహేశ్వరి, ఈ-చాంప్స్ సమన్వయకర్త గాయత్రి, ఈ-చాంప్స్ ఉపప్రిన్సిపాల్ సుమ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి.

# రాజ్యాంగ సవరణతోనైనా బీసీలకు జనాభా దామాషా రిజర్వేషన్లు కల్పించాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ డిమాండ్

**ఉప్పల్,అక్టోబర్ 9,(ప్రజాజ్యోతి):** బీసీలకు జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు పెంచేందుకు అవసరమైతే రాజ్యాంగాన్ని సవరించైనా చర్యలు తీసుకోవాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బీసీలకు జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాజుల లింగం గౌడ్ మాట్లాడుతూ దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు జనాభా నిష్పత్తికి అనుగుణంగా అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు రాజ్యాంగ స్ఫూర్తిలో అంతర్భాగమని పేర్కొన్నారు. బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయ ప్రాతినిధ్యంలోనూ తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రస్తుత రిజర్వేషన్ పరిమితుల నేపథ్యంలో బీసీలకు జనాభా నిష్పత్తికి అనుగుణంగా ప్రాతినిధ్యం కల్పించడంలో అడ్డంకులు ఎదురవుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు అవసరమైన విధానపరమైన, చట్టపరమైన చర్యలు చేపట్టాలని, అవసరమైతే రాజ్యాంగ సవరణ దిశగా కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. బీసీలకు సామాజిక న్యాయం అందించడంలో ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని జాజుల లింగం గౌడ్ కోరారు. బీసీల హక్కులు, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు భాస్కర్, నరసింహ చారి, బండి గారి రాజు, నరసింహ నాయక్, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.



# నవ చైతన్య స్కూల్లో బతుకమ్మ సంబరాలు

ఆటపాటలతో అలరించిన చిన్నారులు..

ఉత్సాహంగా పాల్గొన్న ఉపాధ్యాయులు, యాజమాన్యం



**చేవెళ్ల, అక్టోబర్ 09(ప్రజా జ్యోతి):** చేవెళ్లలోని నవ చైతన్య హైస్కూల్‌లో ముందస్తు బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో సందడి చేస్తూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, యాజమాన్యం వేడుకల్లో పాలుపంచుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను చాటుతూ ఉత్సవాలను నిర్వహించారు. చిన్నారుల సందడితో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.

# పర్యావరణ పరిరక్షణకు సమష్టి కృషి అవసరం

పరిశ్రమలు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వ సంస్థల సమన్వయం కీలకం

చెరువుల పునరుద్ధరణలో ప్రజల భాగస్వామ్యం అవసరం





**ఉప్పల్,అక్టోబర్ 08,(ప్రజాజ్యోతి):** పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి వనరుల పునరుద్ధరణకు పరిశ్రమలు,శాస్త్రవేత్తలు, ప్రభుత్వ సంస్థలు సమన్వయం తో పనిచేయాలని ఎకోరెస్--2026 సదస్సులో నిపుణులు సూచించారు. ఆధునిక సాంకేతికతతో పర్యావరణ వ్యవస్థలను కాపాడాలని పేర్కొన్నారు.సీఎస్ఐఆర్--నీరి డైరెక్టర్ డాక్టర్ ఎస్. వెంకట మోహన్ సదస్సుకు స్వాగతం పలికారు. సీఎస్ఐఆర్--ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి. శ్రీనివాస రెడ్డి పర్యావరణ పరిరక్షణలో శాస్త్రీయ పరిశోధనల ప్రాధాన్యాన్ని వివరించారు. సదస్సు అతిథి ఎస్.ఎన్. శాస్త్రి పరిశ్రమల్లో పర్యావరణహిత విధానాలను ప్రోత్సహించాలని సూచించారు.హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెరువుల పునరుద్ధరణకు హైడ్రా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. పద్మశ్రీ డాక్టర్ ఏకలవ్య శర్మ హిమాలయ పర్యావరణ పరిరక్షణలో శాస్త్రీయ పద్ధతులు, ఆధునిక సాంకేతికతతో పాటు స్థానిక ప్రజల భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు.పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమలు, శాస్త్రవేత్తలు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని నిపుణులు పిలుపునిచ్చారు. ప్రకృతి వనరుల సంరక్షణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టినప్పుడే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమని తెలిపారు.

# డ్రైనేజీకి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి..

హైడ్రాతో సమన్వయం చేసుకుని పనులు వేగవంతం చేయాలి

అధికారులకు కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాలు



**మేడిపల్లి (ప్రజా జ్యోతి) :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్ ప్రత్యేక దృష్టి సారించారు.ఇందులో భాగంగా ఉప్పల్ పరిధిలోని చిల్కానగర్,మల్లికార్జున్ నగర్ ప్రాంతాల్లో పర్యటించి వర్షపు నీటి పారుదల సమస్యతో పాటు ప్రతిపాదిత రహదారి అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.స్టార్మ్ వాటర్ డ్రెయిన్ అవుట్‌లెట్ సమస్యపై కమిషనర్ సమీక్షించారు.ప్రస్తుతం వర్షపు నీరు ప్రైవేట్ స్థలం గుండా ప్రవహించి నాచారం చెరువు అవుట్‌లెట్ నాలాలో కలుస్తున్న నేపథ్యంలో నీటి ప్రవాహ మార్గాన్ని సమగ్రంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం,కాలనీలు ముంపునకు గురికావడం వంటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కార మార్గాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.రహదారి అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి వరంగల్ జాతీయ రహదారి నుంచి నల్ల చెరువు మీదుగా మల్లికార్జున్ నగర్ వరకు ప్రతిపాదించిన రహదారి అభివృద్ధి పనుల పురోగతిపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు.ఈ పనులకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలను గుర్తించి,హైడ్రా అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.రహదారి అభివృద్ధి పనులు ముందుకు సాగేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అదికారులు పాల్గొన్నారు.

# నేడు బోడుప్పల్ లో విద్యుత్ సరఫరాలో అంతరాయం...

**మేడిపల్లి (ప్రజా జ్యోతి) :** నేడు చిలుకానగర్ విద్యుత్ డివిజన్ సరస్వతి కాలనీ ఫీడర్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు చిల్కానగర్ విద్యుత్ శాఖ ఏఈ వినయ్ కుమార్ రెడ్డి తెలిపారు.సరస్వతి కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12గంటల నుంచి 1గంటల వరకు శ్రీనగర్ కాలనీ,సరస్వతి కాలనీ, విజయపురి కాలనీ,సాయిరాం నగర్,ఉదయ్ నగర్,అశోక్ నగర్, ప్రశాంత్ నగర్ వరకు ప్రధాన రహదారి ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకొని విద్యుత్ శాఖకు సహకరించాలని ఏఈ వినయ్ కుమార్ రెడ్డి కోరారు.

# బోడుప్పల్‌లో వైభవంగా శ్రీ మాతా నిమిషాంబ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**అక్టోబర్ 11 నుంచి అక్టోబర్ 20 వరకు వేడుకలు..**

తొలిసారిగా మాలధారణ దీక్ష ప్రారంభం... మేడిపల్లి (ప్రజా జ్యోతి) : శ్రీ సోమవంశ క్షత్రియ నకాష్ కులస్తుల కులదేవత శ్రీ మాతా నిమిషాంబ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు బోడుప్పల్‌లో అక్టోబర్ 11 నుంచి 20 వరకు వైభవంగా నిర్వహించనున్నారు.శ్రీ హంపీ విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానం,హంపీ పీఠం ఆధ్వర్యంలో జరిగే ఉత్సవాలకు ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ విషయాన్ని ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కె.అశోక్‌కుమార్ తెలిపారు.ఈ ఏడాది నుంచి తొలిసారిగా శ్రీ మాతా నిమిషాంబ దేవి మాలధారణ దీక్షను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. తొలిరోజు మాలధారణ చేసుకున్న భక్తులు అక్టోబర్ 20న విజయదశమి సందర్భంగా దీక్ష విరమించవచ్చని పేర్కొన్నారు. ప్రతిరోజూ అమ్మవారికి విశేష అలంకరణలు,సామూహిక చండీ హోమం నిర్వహించనున్నారు. సరస్వతీ దేవి అలంకరణ రోజున విద్యార్థులతో సామూహిక సరస్వతీ హోమం, అన్నపూర్ణ దేవి అలంకరణ రోజున సామూహిక అన్నప్రసాద వితరణ చేపట్టనున్నారు.

భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు నవరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు తాగునీరు, ప్రసాదం ఉచితంగా అందించడంతోపాటు ప్రదక్షిణలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు.ఆలయం వద్ద పార్కింగ్ సౌకర్యం పరిమితంగా ఉన్నందున భక్తులు ప్రజా రవాణాను వినియోగించాలని నిర్వాహకులు సూచించారు.మెట్రో రైలులో ఉప్పల్ వరకు చేరుకుని అక్కడి నుంచి ఇతర రవాణా మార్గాల్లో ఆలయానికి రావచ్చన్నారు.ప్రతిరోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఆలయ దర్శనంతోపాటు 16 వెయిల 108 ప్రదక్షిణలు చేసేందుకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. భక్తులందరూ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు



పొందాలని చైర్మన్ కామరౌతు వినోద్‌కుమార్,ప్రధాన కార్యదర్శి కె.అశోక్‌కుమార్ కోరారు.

# శ్మశానవాటిక, ప్రభుత్వ భూమి, నాలా ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలి

**ఆకృతి కన్స్ట్రక్షన్‌పై శేరిలింగంపల్లి ఎమ్మార్వో మహిపాల్ రెడ్డికి ఫిర్యాదు చేసిన గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి**

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లి సర్వే నెం. 21లో గ్రామ ప్రజలకు ఎంతో అవసరమైన శ్మశానవాటిక స్థలం, సహజ నాలా ఆక్రమణలపై మరియు ప్రభుత్వ భూమిలో ఆకృతి కన్స్ట్రక్షన్ అనే నిర్మాణ సంస్థ అక్రమ నిర్మాణాలు చేపడుతున్న విషయమై కఠిన చర్యలు తీసుకోవాలని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి శేరిలింగంపల్లి ఎమ్మార్వోకు మహిపాల్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ...ప్రభుత్వ భూములు, చెరువులు, నాలాలు, శ్మశానవాటికలు వంటి ప్రజా అవసరాలకు సంబంధించిన స్థలాలను పరిరక్షించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు.ఒకవైపు ప్రభుత్వం ప్రభుత్వ భూములు, జలవనరుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆక్రమణలపై ఫిర్యాదులు రావడం ఆందోళనకరమని అన్నారు.గ్రామ ప్రజలకు అత్యంత అవసరమైన శ్మశానవాటిక స్థలం అనేది కేవలం ప్రభుత్వ భూమి మాత్రమే కాదని, అది గ్రామ ప్రజల సామాజిక, సాంస్కృతిక అవసరాలతో ముడిపడిన ముఖ్యమైన ప్రజా స్థలమని గంగాధర్ రెడ్డి స్పష్టం చేశారు.ప్రతి కుటుంబానికి తమ ఆత్మీయులకు గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించుకునే అవకాశం ఉండాలని, అలాంటి అవసరానికి సంబంధించిన స్థలాలు ఆక్రమణలకు గురికావడం వల్ల భవిష్యత్తులో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.అవసరమైన చోట హద్దురాళ్లు ఏర్పాటు చేసి, శ్మశానవాటికకు వెళ్లే దారులు, అంత్యక్రియలు నిర్వహించే స్థలం ఎలాంటి అడ్డంకులు లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.నాలా ఆక్రమణలతో భవిష్యత్తులో వరద ముప్పు సర్వే నంబర్

21లోని ప్రభుత్వ భూమిలో నాలా ఆక్రమణకు గురై అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు తమకు అందిన సమాచారం, ఫిర్యాదుల ఆధారంగా అధికారుల దృష్టికి తీసుకువచ్చామని గంగాధర్ రెడ్డి తెలిపారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని కోరారు.సహజ నాలాల ప్రవాహ మార్గాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే భారీ వర్షాల సమయంలో వరద నీరు సక్రమంగా ప్రవహించక పరిసర ప్రాంతాలు, కాలనీలు, గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు



ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు. చెరువులకు నీరు చేరే మార్గాలు మూసుకుపోవడం వల్ల జలవనరుల పరిరక్షణకు విఘాతం కలగడంతో పాటు పర్యావరణ సమతుల్యత, భూగర్భ జలాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.ప్రభుత్వ భూములు ప్రైవేట్ ప్రయోజనాలకు కాదు ప్రభుత్వ భూములు, శ్మశానవాటికలు, సహజ నాలాలు ప్రజా ప్రయోజనాల కోసం పరిరక్షించాల్సిన ఆస్తులని గంగాధర్ రెడ్డి అన్నారు. రెవెన్యూ, మున్సిపల్, నీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో సర్వే నిర్వహించి, సర్వే నంబర్ 21లోని ప్రభుత్వ భూమి హద్దులు, శ్మశానవాటిక విస్తీర్ణం, నాలా అసలు మార్గం, ప్రస్తుత పరిస్థితులను అధికారిక రికార్డుల ఆధారంగా నిర్ధారించాలని కోరారు.ఖ

# వైద్యం వికటించి బాలుడు మృతి

**చెంగిచెర్ల ఎస్ఎల్ఎన్ఎస్ క్లినిక్‌లో బాలుడి మృతి**
**జ్వరం చికిత్సకు వెళ్లిన 14 ఏళ్ల అనురుషిక్ మృత్యువాత**
**ఇంజక్షన్ వికటించిందని కుటుంబ సభ్యుల ఆరోపణ**
**క్లినిక్ మూసివేసి పారిపోయినట్లు స్థానికుల వెల్లడి**
**ఎఫ్ఐఆర్ నమోదు చేసిన మేడిపల్లి పోలీసులు**



**మేడిపల్లి (ప్రజా జ్యోతి) :** జ్వరం వస్తే వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లిన ఓ బాలుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చిన ఈ ఘటన చెంగిచెర్లలో తీవ్ర కలకలం రేపింది.ఎంబీబీఎస్ వైద్యుల పేర్లను ఉపయోగిస్తూ ఆర్ఎంపీ వైద్యం చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో 14 ఏళ్ల బాలుడు అనురుషిక్ మృతి చెందడం స్థానికంగా ఆందోళనకు దారితీసింది.బాలుడికి అందించిన చికిత్స,ఇంజక్షన్ వివరాలు క్లినిక్‌లో వైద్య సేవలు నిర్వహిస్తున్న వ్యక్తి అర్హతలపై సమగ్ర విచారణ జరపాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

**జ్వరం చికిత్సకు వెళ్లి.. మృత్యువాత..!**

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మాత అరవింద కాలనీలో నివాసం ఉంటున్న సత్యనారాయణ కుమారుడు అనురుషిక్(14) జ్వరంతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు క్రాంతికాలనీ చెంగిచెర్లలో ఉన్న ఎస్ఎల్ఎన్ఎస్ క్లినిక్‌కు తీసుకెళ్లారు.అక్కడ పిల్లల వైద్యుడిగా పేర్కొంటున్న వినిత్ రెడ్డి పేరుతో వైద్య సేవలు అందుతున్నాయని,అదే క్లినిక్‌లో సాయి క్రిష్ణ అనే వ్యక్తి బాలుడికి చికిత్స చేసి ఇంజక్షన్ ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఇంజక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికే బాలుడు అపస్మారక స్థితిలోకి వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు.దీంతో సదరు వ్యక్తే క్యాబ్ బుక్ చేసి బాలుడిని మేడిపల్లిలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.అయితే బాలుడు ఆసుపత్రికి చేరుకునేలోపే మృతి చెందినట్లు తెలిసింది.ఈ ఘటనతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

**చికిత్స వివరాలపై అనుమానాలు.. విచారణకు డిమాండ్**

బాలుడికి ఏ మందులు ఇచ్చారు? ఏ ఇంజక్షన్ వేశారు? చికిత్స అందించిన వ్యక్తికి వైద్య అర్హతలు ఉన్నాయా? అనే అంశాలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.పోస్టుమార్టం నివేదిక, వైద్య రికార్డులు,సంబంధిత నిపుణుల పరిశీలన ఆధారంగానే బాలుడి మృతికి ఖచ్చితమైన కారణం వెల్లడికావాల్సి ఉంది.

**క్లినిక్‌కు తాళం వేసి పరార్..స్థానికుల ఆగ్రహం.!**

బాలుడి మృతి విషయం తెలుసుకున్న స్థానికులు క్లినిక్ వద్దకు చేరుకునేలోపే సాయి క్రిష్ణ షట్టర్‌కు తాళం వేసి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో వారి అనుమానాలు మరింత పెరిగాయి.ఘటనపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి క్లినిక్ నిర్వహణ, వైద్య సేవలు అందిస్తున్న వ్యక్తుల అర్హతలు, మందులు మరియు ఇంజక్షన్ల వినియోగంపై తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఎంబీబీఎస్ పేర్ల మాటున ఆర్ఎంపీ వైద్యమా?**

ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాల్సిన చోట అర్హతలేని వ్యక్తులు చికిత్స అందిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.ఎంబీబీఎస్ వైద్యుల పేర్లను క్లినిక్ బోర్డులపై ప్రదర్శిస్తూ,వాస్తవంగా ఎవరు వైద్యం అందిస్తున్నారనే విషయాన్ని రోగులకు స్పష్టంగా తెలియజేయకపోతే ప్రజల ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కేవలం పైపై తనిఖీలకే పరిమితం కాకుండా క్లినిక్‌లలో వైద్య సేవలు అందిస్తున్న వారి అర్హతలు, రిజిస్ట్రేషన్లు,చికిత్సా విధానాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కోరుతున్నారు.

**శోకసంద్రంలో కుటుంబం.. న్యాయం చేయాలని వేడుకోలు**



కళ్లముందే ఎదిగిన కుమారుడు ప్రాణాలు కోల్పోవడంతో సత్యనారాయణ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. చిన్నపాటి జ్వరంతో బాధపడుతున్న బాలుడు మృతి చెందడం ఆ కుటుంబానికి తీరని లోటుగా మారింది. అనురుషిక్ మృతికి దారితీసిన పరిస్థితులపై నిష్పక్షపాత విచారణ జరిపి,బాధ్యులుగా తేలిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు,ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వైద్య ఆరోగ్య శాఖ కఠిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఎఫ్ఐఆర్ నమోదు చేసిన మేడిపల్లి పోలీసులు : బాలుడి మృతి ఘటనపై ఆర్ఎంపీ వైద్యుడు సాయి కృష్ణపై మేడిపల్లి ఎస్ఐ ఉదయ్ భాస్కర్ కేసు నమోదు చేశారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.పోస్టుమార్టం నివేదిక అనంతరం బాలుడి మృతికి గల కారణాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# చందానగర్ ముత్తూట్ లో గోల్డ్ గోల్ మాల్

**నగదు చెల్లించిన బయటకి రాని నగలు**
**బంగారం ఉంది అంటారా? లేదా? అని చర్చగా మారింది.**




**శేరిలింగంపల్లి, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ లోని ముత్తూట్ ఫైనాన్స్ లో పెట్టిన బంగారం విషయం లో కస్టమర్లు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా శుక్రవారం చందానగర్ లోని ముత్తట్ ఫైనాన్స్ లో బంగారం తాకట్టు పెట్టిన కస్టమర్లు బంగారానికి సంబంధించిన పూర్తి నగదు తిరిగి చెల్లించిన కానీ వారికి సంబంధించిన బంగారు ఆభరణాలు ఇవ్వడానికి ముత్తూట్ చందానగర్ శాఖ సిబ్బంది మేనేజరు తాత్సారం చేస్తున్నారని పలువురు కస్టమర్లు ఆందోళన వ్యక్తం చేశారు గత కొద్ది రోజుల నుండి చందానగర్ ముత్తూట్ శాఖలో ఇదొక ఆనవాయితీగా మారిందని పదులకొద్దీ కస్టమర్లను బంగారం తిరిగి ఇచ్చే క్రమంలో వారిని తీవ్ర మనోవేదనకు గురి చేస్తున్నారని పలుమార్లు బ్రాంచి చుట్టూ తిరిగేలా చేస్తున్నారని పండగల సందర్భంగా తమ నగలను ఇవ్వకుండా మహిళలకు చుక్కలు చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు బంగారం లోన్ అమౌంట్ కి సంబంధించి పూర్తి నగదు చెల్లించినప్పటికిని నిబంధనల పేరిట సిబ్బంది బ్రాంచ్ మేనేజర్ తాకట్టు పెట్టిన బంగారం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని పలువురు కస్టమర్లు వారి ఆవేదన వ్యక్తం చేశారు.

# ఉప్పల్‌లో భారత్--వెస్టిండీస్ మ్యాచ్.. హెచ్‌సీఏ విస్తృత ఏర్పాట్లు

**అక్టోబర్ 14న రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో పోరు**
**రూ.750 నుంచి టికెట్ ధరలు.. మెట్రో ప్రయాణానికి సూచన**
**మౌలిక సదుపాయాలు, భద్రతపై ప్రత్యేక దృష్టి**



**ఉప్పల్, అక్టోబర్ 9,(ప్రజాజ్యోతి)** ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం లో అక్టోబర్ 14, 2026న జరగనున్న భారత్--వెస్టిండీస్ అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ నిర్వహణకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది. మ్యాచ్ ను విజయవంతంగా నిర్వహించేందుకు మౌలిక సదుపాయాలు, పిచ్ తయారీ, ఫ్లడ్‌లైట్లు, అగ్నిమాపక భద్రత, క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు హెచ్‌సీఏ కార్యదర్శి ఎం. జీవన్ రెడ్డి వెల్లడించినట్లు సమాచారం. మ్యాచ్ టికెట్ ధరలు రూ.750 నుంచి ప్రారంభమవుతాయని, టికెట్ల విక్రయాలకు టికెట్ జెనీ అధికారిక భాగస్వామిగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (యూఎన్ఈపీ)తోనూ హెచ్‌సీఏ భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు వివరించారు. మ్యాచ్ రోజున స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రేక్షకులు హైదరాబాద్ మెట్రో రైలులో ప్రయాణించాలని నిర్వాహకులు సూచించినట్లు సమాచారం. మ్యాచ్ ప్రారంభానికి కనీసం రెండు గంటల ముందే స్టేడియానికి చేరుకోవాలని కోరినట్లు తెలిసింది. భారీ సంఖ్యలో ప్రేక్షకులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో మ్యాచ్ నిర్వహణ, భద్రత, రవాణా ఏర్పాట్లపై దృష్టి సారించారు.

# నీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

**గౌతమి నగర్ కాలనీ వి ఆర్ రెసిడెన్సి సభ్యులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి**



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):**గౌతమీనగర్ కాలనీలోని వి.ఆర్.రెసిడెన్సీ నీటి సమస్యను పరిష్కరించాలని, తగిన సామర్థ్యం కల పైపులైన్ పెంచేలా సంబంధిత అధికారులను ఆదేశించి చర్యలు చేపట్టాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ని కోరిన వి.ఆర్.రెసిడెన్సీ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ.ఈ సందర్భంగా స్థానిక నాయకులు రెడ్డి రఘునాథ్ రెడ్డి,జనార్దన్ రెడ్డి అసోసియేషన్ సభ్యులు ఎస్. రమేష్, కె.సురేష్ కుమార్,ఎం. మల్లికార్జున్ రావు,శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# యెన్కెపల్లి లో సొంత నిధులతో విద్యుత్ స్తంభాల ఏర్పాటు

**11వ వార్డు కౌన్సిలర్ మద్యపాగు మహేష్**



**మొయినాబాద్ : (ప్రజా జ్యోతి)** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని యెన్కెపల్లి గ్రామంలో 11వ వార్డు కౌన్సిలర్ మద్యపాగు మహేష్ తన సొంత నిధులతో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయిస్తున్నారు. గ్రామంలో బతుకమ్మ, దసరా పండుగలను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు చేపట్టారు.పండుగల సమయంలో గ్రామంలో ప్రజల రాకపోకలు పెరిగే నేపథ్యంలో వీధుల్లో మెరుగైన వెలుతురు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా తన వంతు సహకారం అందిస్తూ విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు ముందుకు వచ్చారు. ప్రజల అవసరాలను గుర్తించి వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్న కౌన్సిలర్ మద్యపాగు మహేష్ చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని పేర్కొంటున్నారు. పండుగల వేళ గ్రామ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమం స్థానికులకు ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు,

# ఉప్పల్ జోనల్ వర్క్ షాపులో టీడబ్ల్యూయూ విజయం

**మేడిపల్లి (ప్రజా జ్యోతి) :** టీజీఎస్‌ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఉప్పల్ జోనల్ వర్క్ షాపులో టీయూడబ్ల్యూ కూటమి విజయం సాధించింది. మొత్తం 210 ఓట్లకు గాను క్లాస్ 3 లో 94,క్లాస్ 6 లో 90 ఓట్లు రాగా, తెలంగాణ వర్కర్స్ యూనియన్ క్లాస్ 3 లో 110, క్లాస్ 6 లో 113 ఓట్లు వచ్చాయి. టీడబ్ల్యూయూ విజయం విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. అనంతరం కార్మికులు సంబరాలు జరుపుకున్నారు.ఎచెంగిచెర్ల డిపోలో ఎంప్లాయిస్ యూనియన్ కూటమి గెలుపు చెంగిచెర్ల ఆర్టీసీ డిపోలో ఎంప్లాయిస్ యూనియన్ కూటమి ఘన విజయం సాధించింది. క్లాస్ ఎంప్లాయిస్ యూనియన్ కూటమికి 411 ఓట్లు రాగ టీడబ్ల్యూయూ కూటమికి 215 వచ్చాయి. దీంతో 196 ఓట్ల మెజారిటీతో ఎంప్లాయిస్ యూనియన్ కూటమి విజయం సాధించింది. క్లాస్ 6 లో టీఎంయూ కూటమి కి 367 ఓట్లు రాగ టీడబ్ల్యూయూ కూటమికి 255 ఓట్లు లభించాయి. దీంతో 112 ఓట్ల మెజారిటీతో ఎంప్లాయిస్ యూనియన్ కూటమి విజయం సాధించింది. ఉప్పల్ డిపోలో ఎంప్లాయిస్ యూనియన్ కూటమి ఘనవిజయం ఉప్పల్ డిపోలో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికలలో ఎంప్లాయిస్ యూనియన్ కూటమికి క్లాస్ 3 లో 491 ఓట్లు రాగ టీడబ్ల్యూయూ కూటమికి 122 ఓట్లు లభించాయి. దీంతో 369 ఓట్ల మెజారిటీతో ఎంప్లాయిస్ యూనియన్ కూటమి ఘన విజయం సాధించింది. క్లాస్ 6 లో టీఎంయూ కూటమికి 443 ఓట్లు రాగ టీడబ్ల్యూయూ కూటమికి 161 ఓట్లు లభించాయి. దీంతో 282 ఓట్ల మెజారిటీతో ఎంప్లాయిస్ యూనియన్ కూటమి ఘన విజయం సాధించింది.



# మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరికి వినతి పత్రం అందజేసిన ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్

చిలుక నగర్ శాఖ

తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి,

మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్,అక్టోబర్ 9,(ప్రజ జ్యోతి):** తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, చిలుకానగర్ యూనిట్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా కలెక్టర కు వినతి పత్రం సమర్పణ తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, చిలుకానగర్ యూనిట్ పక్షాన సంఘానికి శాశ్వత భవన నిర్మాణం, లైబ్రరీ, వాకింగ్ ట్రాక్, హెల్త్ క్లబ్, 200 మంది వృద్ధులకు అనుకూలమయ్యే అనాథ వృద్ధాశ్రమం నిర్మించుకొనుటకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరుతూ,పార్లమెంట్ సభ్యులు, మల్కాజ్‌గిరి ఈటల రాజేందర్ జిల్లా కలెక్టర్ కు శాలువాతో సత్కరించి, సీనియర్ సిటిజన్ మెమెంటో వినతి పత్రాన్ని అందజేశారు,శుక్రవారం మేడ్చల్ జిల్లా కార్యాలయం లో జిల్లాస్థాయి దిశా సమావేశం జరుగుతున్న సందర్భంగా, ఒకే వేదికపై పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ , ఉప్పల్ శాసనసభ్యులు బండారు లక్ష్మారెడ్డి జిల్లా కలెక్టర్ ను కలిసే అవకాశం లభించడం ఆనందదాయకం.ఈ సందర్భంగా ఆల్ సీనియర్ సిటిజన్స్ చిలుక నగర్ శాఖ సంఘ పెద్దలు, అనుభవజ్ఞులు బొమ్మగాని దాసు గౌడ్, భూమి ఆవశ్యకత, రాబోయే రోజుల్లో వృద్ధుల సంక్షేమానికి దాని ప్రాధాన్యతను చక్కని ఉచ్చారణ తో సవివరంగా వివరించారు. గతంలో ఏపీఐఐసీ ద్వారా మూతపడిన (సిక్ ) పరిశ్రమల భూములను ఏ విధంగా ప్రజా వినియోగంలోకి తెచ్చారో ఉదాహరణగా తెలిపారు. ఆ ముగ్గురు పెద్దలు మా వినతిని శ్రద్ధగా ఆలకించి, ఈ విషయాన్ని సంబంధిత అధికారులతో చర్చించి, తమ వంతు సహాయం అందిస్తామని,"ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం" అని తెలియజేసి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి దేవసాని బాలచందర్ , రాజేందర్ సమయాన్ని తీసుకుని ముగ్గురు ప్రముఖులను ఒకేసారి కలిసేలా సహకరించినందుకు సంఘం పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు. అలాగే ఉదయం 7 గంటల నుండే సంఘ కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించిన కోశాధికారి షామీర్పేట్ చంద్రయ్య,ఉపాధ్యక్షులు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి,దేవులపల్లి పురుషోత్తం , సంఘానికి వెన్నంటి ఉంటూ ఆచరణాత్మక సలహాలు ఇస్తున్న ప్రముఖ సలహాదారులు పెండం నాగార్జున ,శ్రీరామ్ చర్ల బలరాం, కార్యవర్గ సభ్యులు పన్నాల రామ్ రెడ్డి,బుసిరెడ్డి నారాయణ రెడ్డి సుధాకర్ రెడ్డిలకు సంఘం పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేస్తున్నాము

# అంగన్‌వాడీల్లో ఉద్యోగాల జాతర

264 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

టీచర్లు 102, ఆయాలు 162

అక్టోబర్ 10 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 9( ప్రజా జ్యోతి):** వికారాబాద్ జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ పరిధిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న 102 అంగన్‌వాడీ టీచర్లు, 162 అంగన్‌వాడీ ఆయా పోస్టులు.. మొత్తం 264 పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. ప్రాజెక్టుల వారీగా ఖాళీలు: కోడంగల్ ప్రాజెక్టులో 13 టీచర్లు, 31 ఆయా పోస్టులు; మర్పల్లి ప్రాజెక్టులో 21 టీచర్లు, 14 ఆయా పోస్టులు; పరిగి ప్రాజెక్టులో 27 టీచర్లు, 78 ఆయా పోస్టులు; తాండూరు ప్రాజెక్టులో 23 టీచర్లు, 28 ఆయా పోస్టులు; వికారాబాద్ ప్రాజెక్టులో 18 టీచర్లు, 11 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కలెక్టర్ వెల్లడించారు. దరఖాస్తుల గడువు ఇదే: అర్హులైన మహిళా అభ్యర్థులు అక్టోబర్ 10 నుంచి 24వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు హ్ట్ట్ప్స://ఉఉఉ.అఅఉ.అఅ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పోస్టులకు సంబంధించిన విద్యార్హతలు, వయోపరిమితి, స్థానికత, రిజర్వేషన్లు, ఎంపిక విధానం, ఇతర నిబంధనల పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించిన రిజర్వేషన్‌కు అర్హులైన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. ధ్రువీకరణ పత్రాల సమర్పణ తప్పనిసరి: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అక్టోబర్ 26 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో కార్యాలయ పనివేళల్లో తమ దరఖాస్తుతో పాటు అవసరమైన ధ్రువీకరణ పత్రాలపై గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన జిరాక్స్ ప్రతులను సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. కేవలం ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తులనే పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. నియామక ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్‌ను రద్దు చేయడం, సవరించడం, మార్పులు చేయడం లేదా అవసరమైన సూచనలు జారీ చేసే అధికారం జిల్లా కలెక్టర్ తోపాటు నియామక కమిటీ చైర్మన్‌కు ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు సంబంధిత చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారులను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

# విద్యార్థులకు తాగునీరు కూడా అందించలేని ప్రభుత్వం ఎందుకు..?

ప్రభుత్వ వైద్య కళాశాలలో సమస్యలపై డాక్టర్ మెతుకు ఆనంద్ ధ్వజం

హాస్టళ్లలో పాములు, తేళ్లు.. ఆహారంలో పురుగులు.. లైబ్రరీలో పుస్తకాల కొరత..

విద్యార్థుల ఇక్కట్లపై ఆగ్రహం

**వికారాబాద్ ప్రతినిధి,అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి):** విద్యార్థులకు కనీసం తాగునీరు కూడా అందించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ మెతుకు ఆనంద్ విమర్శించారు. వికారాబాద్ జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా, గతంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో మంజూరైన ప్రభుత్వ వైద్య కళాశాలను బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థినీ, విద్యార్థులతో మాట్లాడి కళాశాల, హాస్టళ్లలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు వివరించిన సమస్యలు ఆందోళన కలిగిస్తున్నాయని ఆనంద్ పేర్కొన్నారు. కళాశాలలో తాగునీటి సౌకర్యం లేకపోవడం, మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకపోవడం, దోమల నివారణకు చర్యలు తీసుకోకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. హాస్టళ్లలోకి పాములు, తేళ్లు వస్తున్నాయని విద్యార్థులు చెప్పడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోందన్నారు. కళాశాల నుంచి ఆసుపత్రికి వెళ్లేందుకు బస్సు సౌకర్యం కూడా లేదని విమర్శించారు. ఆహార నాణ్యతపై విద్యార్థుల ఆవేదన: హాస్టల్‌లో అందించే ఆహారంలో పురుగులు, పాలలో దోమలు కనిపిస్తున్నాయని విద్యార్థులు ఫిర్యాదు చేసినట్లు ఆనంద్ తెలిపారు. బయటి నుంచి ఆహారం తెచ్చుకునేందుకు అనుమతించకపోవడం, మరోవైపు హాస్టల్‌లో అందించే భోజనం నాణ్యతగా లేకపోవడం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. 'అమ్మ పెట్టదు.. అడుక్కొని తిననివ్వదు' అన్న చందంగా పరిస్థితి తయారైందని ఘాటుగా వ్యాఖ్యానించారు. విద్యార్థుల ఆరోగ్యంతో ముడిపడిన ఆహార నాణ్యత విషయంలో అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.

**వైద్య విద్యకు అవసరమైన సౌకర్యాలేవీ..?**

వైద్య విద్యార్థులకు అత్యంత కీలకమైన ప్రయోగశాలల్లో తగిన సౌకర్యాలు లేవని, గ్రంథాలయంలో చదువుకునేందుకు అవసరమైన పుస్తకాలు, వైద్య జర్నళ్లు అందుబాటులో లేవని ఆనంద్ ఆరోపించారు. ఆధునిక బోధనకు అవసరమైన స్మార్ట్ బోర్డులు లేకపోవడం, విద్యుత్ సరఫరా నిలిచినప్పుడు జనరేటర్‌కు డీజిల్ పోసే పరిస్థితి కూడా లేకపోవడం, హాస్టళ్లలో వాషింగ్ మెషీన్లు లేకపోవడం వంటి సమస్యలను ప్రస్తావించారు. చివరి సంవత్సరం విద్యార్థులకు తరగతి గది కూడా లేకపోవడం విచారకరమన్నారు. ఇప్పటివరకు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందలేదని పేర్కొన్నారు.




స్పీకర్ విద్యార్థుల సమస్యలపై దృష్టి పెట్టాలి : ఈ సందర్భంగా డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ, "మన పిల్లలు ఇటువంటి పరిస్థితుల్లో చదువుకుంటుంటే ఇలాగే వదిలేస్తామా? స్పీకర్ గారు ఆలోచించాలి" అని ప్రశ్నించారు. తాము లేవనెత్తుతున్నవి వ్యక్తిగత సమస్యలు కావని, విద్యార్థుల భవిష్యత్తు, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలని కాంగ్రెస్ నాయకులు గుర్తించాలని అన్నారు. పెద్ద పదవుల్లో ఉండటం కంటే ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడమే ముఖ్యమని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలను విమర్శించడంపై చూపుతున్న శ్రద్ధను ప్రజా సమస్యల పరిష్కారంపై కూడా చూపాలని స్పీకర్‌కు సూచించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించి, హాస్టళ్లలో పరిశుభ్రత, నాణ్యమైన ఆహారం, రవాణా, విద్యా వసతులు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.

## సిబ్బంది సేవలను గుర్తించడమే వారికిచ్చే గౌరవం

పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుకలు

కానుకలు అందజేసిన సర్పంచ్ ఉప సర్పంచ్



**యాచారం, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించడమే వారికి ఇచ్చే గౌరవం అని సర్పంచ్ చిక్కుడు వెన్నెల శేఖర్ ఉపసర్పంచ్ కాలే అనిత రమేష్ అన్నారు. మండల పరిధిలోని కొత్తపల్లిలో సర్పంచ్ ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బందికి దసరా సందర్భంగా నూతన వస్త్రాలు, నిత్యవసర వస్తువులు కానుకలుగా అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య సిబ్బంది సేవలు వెలకట్టలేనివని చెప్పారు. గ్రామ పరిశుభ్రతకు ప్రజలకు సేవలు అందించడం తోపాటు గ్రామాభివృద్ధి కార్యక్రమాలలో నిరంతరం పాలుపంచుకోవడంలో వారి కృషిని బాధ్యతలు గుర్తిస్తున్నామని చెప్పారు. పండుగ కానుకలు అందుకున్న సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారని చెప్పారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

శ్రీ సైన్స్ మోడరన్ స్కూల్‌లో బతుకమ్మ సంబరాలు:

ఆటపాటలతో విద్యార్థుల సందడి:



**కొత్తూరు అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి)** తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను స్థానిక శ్రీ సైన్స్ మోడరన్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకలకు పాఠశాల డైరెక్టర్ వీరమోని అక్షిత ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో ఆకర్షణీయమైన బతుకమ్మలను పేర్చి పాఠశాల ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. అనంతరం విద్యార్థులు బతుకమ్మ చుట్టూ తిరుగుతూ లయబద్ధంగా చప్పట్లు కొడుతూ, భక్తిశ్రద్ధలతో బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. విద్యార్థుల ఆటపాటలతో పాఠశాల ప్రాంగణమంతా పండుగ వాతావరణం సంతరించుకుంది.ఈ సందర్భంగా డైరెక్టర్ వీరమోని అక్షిత ముదిరాజ్ మాట్లాడుతూ... తెలంగాణ విశిష్ట సంస్కృతిని, ప్రకృతిని ప్రేమించే గొప్ప సంప్రదాయాన్ని భావితరాలకు తెలియజేసేందుకే పాఠశాలలో ఇటువంటి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యతో పాటు మన ఆచారాలు, విలువలను పెంపొందించడం పాఠశాల ముఖ్య ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు.

## ఎంపీపీఎస్ పాఠశాల లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థుల ఆటపాటలు





**బోయిన్ పల్లి, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఎంపీపీఎస్ ఆర్కేపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. కల్పన ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు .విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ, బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆటపాటలతో సందడి చేశారు. పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణంతో కళకళలాడింది.ఈ సందర్భంగా ఎస్‌జీటీ సయ్యద్ రూహి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే ఈ పండుగకు తెలంగాణలో ప్రత్యేక స్థానం ఉందన్నారు.విద్యార్థులు చదువుతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల వారిలో సృజనాత్మకత, ఐక్యత, సామూహిక భాగస్వామ్య భావన పెంపొందుతాయని వివరించారు. పండుగల ద్వారా సంప్రదాయాల పట్ల గౌరవం, పెద్దల పట్ల మర్యాద, ప్రకృతి పట్ల ప్రేమ వంటి విలువలు అలవడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్‌జీటీ భారతి, టి. వర్షా, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్చరీ ప్రీమియర్ లీగ్‌లో చోళ చీఫ్స్ బోణీ




**హైదరాబాద్, అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి) :** ఆర్చరీ ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) రెండో సీజన్‌లో చోళ చీఫ్స్ తొలి విజయాన్ని నమోదు చేసింది. నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో కాకతీయ నైట్స్‌పై 6–2తో గెలిచింది. కొలంబియా ఆర్చర్ అలెజాండ్రా ఉస్కియానో సంధించిన ఎనిమిది బాణాలూ పర్ఫెక్ట్ 10 పాయింట్లు సాధించడం విశేషం. రిషభ్ యాదవ్, ఉస్కియానో అద్భుత ప్రదర్శనతో చోళ చీఫ్స్ తొలి రెండు సెట్లను గెలిచి 4–0 ఆధిక్యంలోకి వెళ్లింది. మూడో సెట్‌ను నీరజ్ చౌహాన్ రాణించడంతో కాకతీయ నైట్స్ గెలుచుకున్నా, నిర్ణయాత్మక నాలుగో సెట్‌లో దీపికా కుమారి, మార్కస్ డిఅల్మేడా రాణించడంతో చోళ చీఫ్స్ విజయం ఖరారైంది.

# ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను వెంటనే రాష్ట్రవ్యాప్తంగా రద్దు చేయాలి

**గ్రామసభల ద్వారానే నిజమైన నిరుపేదలను గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలి**

**కమిటీల ఎంపికపై ఆరోపణలు.. ఆర్థికంగా ఉన్నవారికి ఇళ్లు కేటాయిస్తున్నారని విమర్శ**

**తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యదర్శి మది పాల్ వెంకట్**

**చౌడాపూర్ మండల్ (ప్రజా జ్యోతి) అక్టోబర్ 09 :** వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల గ్రామపంచాయతీల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలను రాష్ట్రవ్యాప్తంగా వెంటనే రద్దు చేసి,లబ్ధిదారుల ఎంపిక బాధ్యతలను నూతన గ్రామపంచాయతీ పాలకవర్గానికి అప్పగించాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యదర్శి మందిపల్ వెంకట్ డిమాండ్ చేశారు.గ్రామపంచాయతీలో ఇళ్లు,పెన్షన్లు,ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి గ్రామసభలు, గ్రామపంచాయతీ తీర్మానాలకు ప్రాధాన్యం ఉండాల్సిన నేపథ్యంలో,చట్టబద్ధతపై ప్రశ్నలు ఉన్న ప్రైవేటు వ్యక్తులతో కూడిన కమిటీల ద్వారా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎలా ఎంపిక చేస్తారని ఆయన ప్రశ్నించారు .ఇందిరమ్మ కమిటీలను రద్దు చేసి,పూర్తి బాధ్యతలను సర్పంచ్,నూతన పాలకవర్గం, గ్రామపంచాయతీ కార్యదర్శికి అప్పగించాలని కోరారు.గ్రామసభను బహిరంగంగా నిర్వహించి సొంత ఇల్లు లేని నిజమైన నిరుపేద కుటుంబాలను గుర్తించి అర్హత ఆధారంగా ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు.

**ఆర్థికంగా ఉన్నవారికి ఇళ్లు ఎలా?**

కొన్ని ప్రాంతాల్లో ఆర్థికంగా స్థోమత ఉన్నవారికి,ప్రధాన రహదారుల ప్రక్కన వెంచర్లలలో ఇళ్లు నిర్మించుకునే పరిస్థితి ఉన్నవారికి కూడా ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక జరుగుతోందని మందిపల్ వెంకట్ ఆరోపించారు.ప్రధాన రహదారుల వెంట షట్టర్లు ఏర్పాటు చేసుకునే స్థోమత ఉన్నవారు నిజమైన నిరుపేదలుగా ఎలా పరిగణించబడతారని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో నిజమైన అర్హులను పక్కనపెట్టి, తమకు అనుకూలంగా ఉన్నవారిని ఎంపిక చేస్తున్నారనే ఆరోపణలు ప్రజల నుంచి వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.అటువంటి ఇళ్లపై జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలన చేపట్టి,లబ్ధిదారుల అర్హతను పునఃపరిశీలించాలని



డిమాండ్ చేశారు.నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని వారికి ఇళ్లు మంజూరైనట్లు తేలితే,సంబంధిత ఇళ్లను రద్దు చేసి నిజమైన నిరుపేదలకు అవకాశం కల్పించాలని కోరారు.పేదల సొంతింటి కలను రాజకీయాలకు అతీతంగా నెరవేర్చాలి .గ్రామసభల ద్వారా నిజమైన నిరుపేదలను గుర్తించి అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించాలి .ఇందిరమ్మ కమిటీల విషయంలో ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలి.లేనిపక్షంలో చట్టపరమైన మార్గాలను ఆశ్రయించి హైకోర్టును ఆశ్రయిస్తాం అని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యదర్శి మందిపల్ వెంకట్ హెచ్చరించారు.

# మహిళా సమాఖ్యను ఆర్థికంగ బలోపేతం చేస్తాం

**మహిళా సమైక్య పై వచ్చిన ఆరోపణలు అవాస్తవం**

**కల్టివేటర్ ను ఎవ్వరో దొంగిలించారు**

**మహిళా సమైక్య ద్వారా ఫిర్యాదు చేశాం**

**ఎపిఎం ను బదునాం చేయొద్దు**

**తీవ్రంగా ఖండించిన మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి**

**తాండూరు అక్టోబర్ 9 ప్రజా జ్యోతి :-** తాండూరు మండలం మహిళా సమైఖ్యను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తామని మండల మహిళా సమైఖ్య అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, కార్యదర్శి భానుప్రియ గుర్తు చేశారు. శుక్రవారం రోజు తాండూరు మండల మహిళా సమైఖ్య భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం చేస్తున్న కృషి మరువలేనిదని చెప్పారు. ప్రస్తుతం మహిళా సమాఖ్యను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడం కోసం ఏర్పాటుచేసిన కస్టమర్ హై రింగ్ సెంటర్ ద్వారా ఆదాయం నామమత్రంగానే వస్తుందని చెప్పారు. వ్యవసాయంలో ఉపయోగించే హార్వెస్టర్ ట్రాక్టర్ ఇతర పరికరాలు పలువురు రైతులకు అద్దెకు ఇవ్వడం జరుగుతుందని



గుర్తు చేశారు. అద్దె ద్వారా వచ్చిన డబ్బులను మహిళా సమైఖ్య పరిధిలోని సి ఎస్ సి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. గత కొంతకాలం క్రితం కస్టమర్ హై రింగ్ సెంటర్ లోని వ్యవసాయ పరికరాల ద్వారా వచ్చిన అద్దె డబ్బులు రూ 30 వేల రూపాయలను తాత్కాలికంగా ఏపిఎం ఖాతాలో జమ చేసినప్పటికీ రెండు రోజుల వ్యవధిలో సి ఎస్ సి ఖాతాకు బదిలీ చేయడం జరిగిందన్నారు. అంతేకానీ వ్యక్తిగతంగా ఏపిఎం ఎలాంటి ఫ్రాడ్ చేయలేదని మహిళా సమాఖ్య ప్రతినిధులు విలేకరుల ముందు వెల్లడించారు. కస్టమర్ హైరింగ్ సెంటర్ లోని వ్యవసాయ సామాగ్రిని ఎఫ్ ఈ సి, అలాగే జనరల్ బాడీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకే ఇతర రైతులకు అద్దెకు ఇవ్వడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా యాలాల మండలానికి చెందిన ఓ రైతుకు 30 నెలలకు గాను ట్రాక్టర్ ట్రాలీని అద్దెకి ఇవ్వడం జరిగిందని చెప్పారు. ట్రాలీకి సంబంచిన అద్దె డబ్బులు కూడా ఎస్ ఈ సి ఖాతాలో జమ చేశారని గుర్తు చేశారు. మహిళా సమాఖ్య భవన



ముందు ఉన్న కల్టివేటర్ ను ఎవ్వరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలిచ్చారని చెప్పారు. అట్టి విషయం పోలీసులకు మహిళా సమాఖ్య ద్వారా తీర్మానం చేసి ఫిర్యాదు చేయడం జరిగింది అన్నారు. అదేవిధంగా పాఠశాలకు సంబంధించిన యూనిఫాం తయారీ కోసం మల్కాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళా సంఘానికి ఇవ్వడం జరిగిందని చెప్పారు. అక్కడ విద్యార్థుల కొలతల ప్రకారం బట్ట కత్తిరించిన అనంతరం యూనిఫామ్ లను తయారు కోసం మండలంలోని 32 డ్వాక్రా సంఘాల మహిళలకు అప్పగించామని గుర్తు చేశారు. ఇందులోనూ ఎలాంటి అవకతవకలకు అవకాశం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ పి సి మండల చైర్మన్ అనిత, వైస్ చైర్మన్ శారదా, జెండర్ పాయింట్ సభ్యురాలు, ఏపిఎం బాలయ్య, ఐకేపీ క్లస్టర్ కోఆర్డినేటర్లు సత్యనారాయణ, బందెప్ప, నర్సింలు, సయ్యద్, సంజీవ్, ప్రభు రాజ్,సంధ్యా, శంకర్,అకౌంటెంట్ కవిత,తదితరులు ఉన్నారు.

# పంట పొలాలను పరిశీలించిన కేంద్ర బృందం

**మహిళా సంఘాల పనితీరు పై ప్రశంసలు**

**కందుల ప్రాసెసింగ్ యూనిట్ నిర్వహణతో ఆర్థిక అభివృద్ధి**

**జాయింట్ డైరెక్టర్ డిపిడి అర్జున్ కుమార్ శివహరే**

**కంది పంట సాగుకు అధిక ప్రాధాన్యత**

**కందులను పప్పుగా మారిస్తేనే ఆర్థిక అభివృద్ధి**

**జిల్లా వ్యవసాయ అధికారి కవిత**

**తాండూరు అక్టోబర్ 9 ప్రజా జ్యోతి:** వికారాబాద్ జిల్లా తాండూరు సబ్ డివిజన్ ప్రాంతంలో కంది పంటతో పాటు పప్పు దినుసుల పంటను పండించేందుకు ఇక్కడి రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపడంతో ఈ పంటలపైనే ఎక్కువ ఆదాయం సమకూర్చుకుంటారనే దానిపై కేంద్ర పల్స్ డెవలప్మెంట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అరున్ కుమార్ శివహరే, జిల్లా వ్యవసాయ అధికారి కవిత గుర్తు చేశారు. శుక్రవారం రోజు



తాండూరు పరిసర ప్రాంతంలో పలు పంట పొలాలను స్థానిక వ్యవసాయ శాఖ ఏ డి ఏ అరుణ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో డ్వాక్రా మహిళ సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మహిళా సమాఖ్య ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కందుల కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అదేవిధంగా అవసరమైన మేరకు నిధులను సమకూర్చుకొని కందిపప్పు ప్రాసెస్ యూనిట్ ను ఏర్పాటు చేసి అధిక లాభాలు



పొందాలని సూచించారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ సంయుక్తంగా కృషి చేస్తుందన్నారు. స్థానిక వ్యవసాయ అధికారుల ద్వారా రైతులకు మినీ విత్తనాల కిట్లను అందజేయడం జరిగిందన్నారు.ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఏవో శ్రీనివాస్ , ఐకెపి ఎపిఎం బాలయ్య, మహిళా సమాఖ్య ప్రతినిధులు, క్లస్టర్ కోఆర్డినేటర్లు రైతులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

**అంగన్వాడి టీచర్లు పోస్టులు 05**

**ఆయా పోస్టులు 11**

**అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలి**

**సిడిపిఓ శ్రీలక్ష్మి**

బషీరాబాద్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలో అంగన్వాడీ టీచర్లు, ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైనట్లు సీడీపీఓ శ్రీలక్ష్మి తెలిపారు. అర్హత ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండలంలో 5 అంగన్వాడీ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో జీవన్గి--3, కొర్విచేడు--1, బాద్లాపూర్--1 పోస్టులు ఉన్నాయి. అలాగే 11 ఆయా పోస్టులు ఖాళీగా ఉండగా, ఇవి నంద్యా నాయక్ తండా, జమ్లా నాయక్ తండా, బోజ్యా నాయక్ తండా, మంతన్ గౌడ్ తండా, బాద్లాపూర్ తండా, ఇస్మాయిల్పూర్, కొర్విచేడ్ తండా, కాశీంపూర్ తండా, నీళ్లపల్లి తండా, తౌర్యా నాయక్ తండా, హక్యా నాయక్ తండాల్లో ఉన్నట్లు తెలిపారు. ఆయా పోస్టులకు ఆయా గిరిజన ప్రాంతాలకు చెందిన మహిళలకు అవకాశం కల్పించినట్లు సీడీపీఓ పేర్కొన్నారు. దరఖాస్తులు ముఖ్యమైన తేదీలు అక్టోబర్ 10 ఆన్లైన్లో దరఖాస్తు స్వీకరణ ప్రారంభం అక్టోబర్ 24 ఆన్లైన్ దరఖాస్తులకు చివరి తేదీ సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే అవకాశం అక్టోబర్ 26 నుంచి నవంబర్ 1 వరకు ధ్రువీకరణ పత్రాలు సమర్పణకు గడువు అర్హత కలిగిన మహిళలు అభ్యర్థులు నిర్ణీత గడువులోగా ఆన్లైన్ ధర దరఖాస్తు చేసుకోవాలని సూచించడం అయినది పూర్తి సమాచారం కొరకు అధికార వెబ్సైట్లను సందర్శించగలరు హ్ట్ట్ప్స్://ఒఒఒ.ఒఎ.హ్స్.అఅఒ.అఅ



## మేడిపల్లి పోలీసుల పర్యవేక్షణలో ప్రశాంతంగా ఆర్టీసీ యూనియన్ ఎన్నికలు

**మూడు కేంద్రాల్లో 98.32 శాతం పోలింగ్ నమోదు**



**మేడిపల్లి, అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి ప్రతినిధి):** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉప్పల్ డిపో, ఉప్పల్ జోనల్ వర్క్షాప్, చెంగిచెర్ల డిపోల్లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) యూనియన్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మేడిపల్లి పోలీసుల పర్యవేక్షణలో, ఆర్టీసీ సిబ్బంది సహకారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది. మూడు పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 1,489 ఓట్లకు గాను 1,464 ఓట్లు పోలయ్యాయి. దీంతో 98.32 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని మేడిపల్లి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ తెలిపారు.

## ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ**

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**





**ఉప్పల్,అక్టోబర్ 9,(ప్రజా జ్యోతి):** ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ పండుగ ప్రారంభం సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ఆటపాటల సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతుందని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలను అందంగా పేర్చి బతుకమ్మగా పూజించడం తెలంగాణ ప్రత్యేకత అని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంలో అంతర్భాగమని, ఆడబిడ్డలు కుటుంబ సభ్యులు, ఆడపడుచులతో కలిసి తొమ్మిది రోజులపాటు ఆటపాటలతో ఆనందోత్సాహా ల మధ్య ఈ పండుగను జరుపుకోవడం మన సంస్కృతిలోని గొప్పతనాన్ని చాటుతుందని తెలిపారు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగిసే ఈ పండుగ రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో ఐక్యతను, సంతోషాన్ని నింపుతుందని అన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పువ్వులతో పూలను పూజించే ఈ పండుగ తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## పరిగిలో కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

**చిన్నారులపై దాడుల నేపథ్యంలో రంగంలోకి దిగిన మున్సిపల్ యంత్రాంగం**



**పరిగి, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** పట్టణంలో వీధి కుక్కల దాడిలో చిన్నారులు గాయపడిన నేపథ్యంలో మున్సిపల్ యంత్రాంగం అప్రమత్తమైంది. వీధి కుక్కల బెడదను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ మేరకు మున్సిపల్ చైర్పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ శుక్రవారం పట్టణంలోని పలు కాలనీల్లో కుక్కలను పట్టుకునే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వీధి కుక్కల బెడదను తగ్గించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు చైర్పర్సన్ తెలిపారు. ఇందులో భాగంగా వారం రోజుల క్రితం బ్లూ క్రాస్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. పట్టణంలో సుమారు 300 కుక్కలకు సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహించడంతో పాటు, వాటికి టీకాలు వేయించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నుంచి కుక్కలను పట్టుకునే చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. వీధి కుక్కల నియంత్రణకు చేపడుతున్న కార్యక్రమానికి పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ ఆరిఫ్ పటేల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయూబ్, కోఆప్షన్ సభ్యుడు అక్బర్ హుస్సేన్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పనిచేయకుండానే 8 నెలల జీతమా?

**పారిశుద్ధ్య కార్మికుడిపై వార్డు సభ్యుల ఫిర్యాదు**



**బషీరాబాద్, అక్టోబర్ 9, ప్రజా జ్యోతి:** వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవాంద్గి గ్రామంలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న ఉపసర్పంచ్ భర్త విధులకు హాజరుకాకుండానే ఎనిమిది నెలలుగా జీతం తీసుకున్నారని ఆరోపిస్తూ గ్రామ వార్డు సభ్యులు శుక్రవారం సర్పంచ్ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై అధికారులు విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్స్ నర్సింలు నరేష్ మౌలానా ఈ పింకీ రాజు అన్వర్మియా భీమ్ రెడ్డి గోపాల్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలి

## అధికారులకు కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశం

**వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** జిల్లాలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టి, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. నీటి కొరత ఎదురయ్యే గ్రామాలను ముందుగానే గుర్తించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సమస్యను పరిష్కరించాలని సూచించారు. శుక్రవారం వ్యవసాయం, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, నీటిపారుదల, విపత్తు నిర్వహణ తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజ్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా తాగునీటి లభ్యత, సరఫరా వ్యవస్థల నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. ప్రజలకు సురక్షితమైన తాగునీటిని నిరంతరాయంగా అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధికారులకు సూచించారు. తాగునీటి సరఫరాపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో





పరిష్కరించాలని, నీటి సరఫరాలో అంతరాయాలు ఎదురయ్యే ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి: ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ జిల్లాలో నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వివిజి రామ్ జీ పథకం కింద వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పిస్తూనే, నీటి సంరక్షణకు ఉపయోగపడే ఇంకుడు గుంతలు, నీటి కుంటల నిర్మాణం, బోరుబావుల రీఛార్జి వంటి పనులను చేపట్టాలని ఆదేశించారు. అలాగే కరువు నివారణకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. నీటి వనరుల అభివృద్ధి, భూగర్భ జలాల పెంపు, తాగునీటి సరఫరా వ్యవస్థల పటిష్ఠతపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఈ శ్రీనివాస్, సీపీఓ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి కవిత, డీహెచ్‌ఎస్‌ఓ సత్తార్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఖర్చు చేసిన గ్రామ పంచాయతీ నిధులపై పూర్తిస్థాయి విచారణ చేపడతాం

**యాలాల అక్టోబర్ 9 ప్రజా జ్యోతి** ఖర్చు చేసిన గ్రామపంచాయతీ నిధులపై పూర్తిస్థాయి విచారణ చేపట్టడం జరిగిందని, పూర్తి వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఎంపీడీవో శ్రీనిజ అన్నారు. మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామపంచాయతీ నిధుల ఖర్చు, వినియోగంపై సర్పంచ్ చెల్క స్వరూప ఇటీవల గ్రామపంచాయతీ నిధులు సర్పంచ్ అయినా తనకు సమాచారం లేకుండా డ్రా చేయడమే కాకుండా , సానిటేషన్ వర్క్ లో కమిషన్ కోసం వేధింపు తనని వేధిస్తున్నారన్నారని, గ్రామ పంచాయితీ సెక్రటరీ శేఖర్ , ఉప సర్పంచ్ దీ రామప్ప ఇద్దరూ కలిసి గ్రామపంచాయతీ నోట్ ఫైల్ పై ఖాళీ స్థలంలో శానిటైజేషన్ కింద తేదీ 12-08-2026 రోజు ఉప సర్పంచ్ దీ రామప్ప పేరు మీద 30,000 బ్లీచింగ్ పౌడర్ కొనకున్న కొన్నట్లు బిల్లు కొట్టడం జరిగిందని, గ్రామపంచాయతీ లోనే లేని వ్యక్తి అయినా మద్దూర్ వెంకటేశ్ పేరు మీద తేదీ 30 -06-2026 రోజూ 4500, మరియు తేదీ29-07-2026 నాడు జెసిబి రోడ్ వర్క్ నడిచినట్లు 15,000 రూపాయలు బిల్లు సర్పంచుకు తెలియకుండా డ్రా చేసుకోవడం జరిగిందని, తనను న్యూా లు అడగకుండానే నిధులు డ్రా కావడం జరిగిందని, గ్రామ పంచాయతీ ఆధీనంలో నిర్మిస్తున్న కొత్త ఇల్లు పర్మిషన్ ఈడిగి దస్తయ్య o/శీ మల్లయ్యకు గ్రామ





పంచాయతీ సెక్రెటరీ శేఖర్ సర్పంచ్ అయినా తనకు తెలుపకుండా తేదీ 27-07-2026 పర్మిషన్ ఇవ్వడం జరిగిందని, గ్రామంలో గొల్ల ఎల్లప్ప o/శీ సాయప్ప రోడ్డులో అక్రమంగా బాత్రూం నిర్మించి, అట్టి బాత్రూం కు డ్రైనేజీ ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, ఇట్టి డ్రైనేజి కి సంబంధించి, గ్రామ సభలో పని గుర్తింపు, గ్రామపంచాయతీ తీర్మానం, వర్క్ ఆర్డర్ లేకుండా కూడా, ఇట్టి డ్రైనేజీ నిర్మాణానికి మొత్తం రూపాయలు 1,00000/- ఇవ్వాలని, గ్రామ ఉపసర్పంచ్ బీటి రామప్ప, గ్రామ పంచాయతీ సెక్రెటరీ శేకర్ మూడు నెలల నుండి బిల్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, మహిళా సర్పంచ్ అయినా తనను వేధిస్తున్నారని, నిధులను స్వలాభం కొరకు దుర్వినియోగం చేసిన ఉపసర్పంచ్ దీ రామప్ప, పంచాయతీ సెక్రెటరీ శేఖర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ చెల్క స్వరూప మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇటీవల ఎంపీడీవో శ్రీనిజకు వినతి పత్రం అందజేశారు. అందులో భాగంగా శుక్రవారం ఎంపీఓ ఆనంద్ రావు, సూపరిండెంట్ కృష్ణారావు లతో కలిసి గ్రామపంచాయతీలో విచారణ చేపట్టారు. సర్పంచ్, ఉప సర్పంచ్ ఇరువురి వాదనలను విన్న తరువాత పంచాయతీ కార్యదర్శి శేఖర్ వివరణ తీసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... నిధుల దుర్వినియోగంపై వాదోపవాదాలు వినడం జరిగిందన్నారు. తీర్మానం లేకుండా పనులు జరిగినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. మరోచోట పనులు జరిగిన తీర్మానాన్ని ఇవ్వలేదన్నారు. ఉన్న తీర్మానంలో మనిషి పేరు లేదన్నారు. పూర్తిస్థాయి రికార్డును పరిశీలించిన తర్వాత ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకువెళ్తామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

# దసరా సెలవుల్లో అప్రమత్తంగా ఉండాలి

## ఇళ్ల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

## జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** దసరా పండుగ, విద్యాసంస్థల సెలవుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సూచించారు. పండుగకు స్వగ్రామాలకు వెళ్లే సమయంలో ఇళ్ల భద్రతతో పాటు ప్రయాణంలో రోడ్డు ప్రమాదాల నివారణ, పిల్లల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే ముందు తలుపులు, కిటికీలు సక్రమంగా మూసివేయాలని, బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను భద్రంగా ఉంచుకోవాలని ఎస్పీ సూచించారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని సోషల్ మీడియాలో బహిరంగంగా వెల్లడించకూడదని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రయాణ సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు ధరించాలని పేర్కొన్నారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ ఉపయోగించవద్దని సూచించారు. రద్దీ ప్రదేశాల్లో పిల్లలను ఒంటరిగా వదిలిపెట్టకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని, పోలీసులకు సహకరిస్తూ దసరా పండుగను ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకోవాలని ఎస్పీ స్నేహ మెహ్రా విజ్ఞప్తి చేశారు.



# వికారాబాద్ జిల్లా ఐపీఎస్ స్నేహమెహ్రా ఆదేశాల మేరకు కుల్కచర్లలో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ విస్తృత తనిఖీలు

## కార్యక్రమంలో పాల్గొన్న డి.ఎస్.పి శ్రీనివాస్

**కుల్కచర్ల మండలం అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి)** కుల్కచర్ల మండల కేంద్రంలో ఈరోజు తనిఖీలు చేయడం జరిగింది నిర్వహించారు ఈ తనిఖీలో 107 మంది పోలీసు సిబ్బందితో పాల్గొన్నారు 54 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు, 34 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు ఇందులో భాగంగా ఇద్దరు రౌడీషీట్లన అదుపులోకి తీసుకున్నారు వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఘూ గారి ఆదేశాల మేరకు, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల నివారణ, ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడం, శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా శు క్రవారం (09-10-2026 తెల్లవారుజామున

పరిగి డీఎస్పీ శ్రీ ఎన్. శ్రీనివాస్ పర్యవేక్షణలో ఉదయం 5:00 గంటల నుంచి 7:00 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 107 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కుల్కచర్ల గ్రామంలోని కిండిగేరి ప్రాంతంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ ఇళ్ల తనిఖీలు, వాహనాల తనిఖీలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికల పరిశీలన వంటి ముందస్తు నేర నియంత్రణ చర్యలు చేపట్టారు.

తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నవి:

54 ద్విచక్ర వాహనాలు: వాహనాల పత్రాలు, సంబంధిత వివరాలను పరిశీలించే క్రమంలో స్వాధీనం చేసుకున్నారు.

2 ఆటోలు: వాహనాల తనిఖీల్లో భాగంగా స్వాధీనం చేసుకున్నారు.

34 లీటర్ల మద్యం: తనిఖీల సందర్భంగా స్వాధీనం చేసుకున్నారు.

ఇద్దరు రౌడీషీటర్ల తనిఖీ: నేర నియంత్రణ చర్యల్లో భాగంగా ఇద్దరు రౌడీషీటర్లను తనిఖీ చేసి, వారి వివరాలను పరిశీలించారు.

ఈ తనిఖీల ద్వారా నేరాలకు అవకాశం కల్పించే పరిస్థితులను ముందుగానే గుర్తించడం, చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడం, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతలను కాపాడడం వంటి అంశాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా పరిగి డీఎస్పీ శ్రీ ఎన్. శ్రీనివాస్, మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. గ్రామాలు, ప్రధాన కూడళ్లు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను



అరికట్టడంతో పాటు, నేరాలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించడం సులభమవుతుందని డీఎస్పీ వివరించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌ల ద్వారా ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంపొందించడం, పోలీసు--ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేయడం, నేరాల నివారణలో ప్రజలను భాగస్వాములను చేయడం, అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించడం ప్రధాన లక్ష్యమని తెలిపినారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి పరిగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొండల్ రెడ్డి కుల్కచర్ల పరిగి చెంగోముల్ దోమకొడంగల్, బొంరాస్‌పేట్ దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు 12 మంది మహిళా పోలీసు కానిస్టేబుళ్లు డబుల్ పిసీలు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామస్తుల ఆరోగ్యమే లక్ష్యంగా మంచినీటి ట్యాంకుల శుభ్రత

## సర్పంచ్ లావణ్య మోహన్‌కు గ్రామస్తుల కృతజ్ఞతలు తెలిపారు

**మోమిన్ పేట్ అక్టోబర్ 9( ప్రజా జ్యోతి)** మోమిన్ పేట్, మండల్ దుర్గం చెరువు గ్రామం మోమిన్ పేట్ మండల పరిధిలోని దుర్గం చెరువు గ్రామంలో గ్రామస్తుల ఆరోగ్య పరిరక్షణకు గ్రామ సర్పంచ్ లావణ్య మోహన్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామ ప్రజలు కలుషిత నీటి వల్ల అనారోగ్యానికి గురికాకుండా ఉండేందుకు గ్రామంలోని మంచినీటి ట్యాంకులను పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన, పరిశుభ్రమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ట్యాంకుల శుభ్రత పనులు చేపట్టడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం వల్ల నీటి పరిశుభ్రతను కాపాడటంతో పాటు, నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల ముప్పును తగ్గించవచ్చని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న సర్పంచ్ లావణ్య మోహన్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని కోరారు.



# తాండూర్ గవర్నమెంట్ హాస్పిటలో

## మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి పేరు మీద టిఫిన్స్ ప్రారంభం

## కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు శ్రీనివాస్



**బషీరాబాద్ అక్టోబర్ 9 ప్రజా జ్యోతి** వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం కొర్వి చెడ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు శ్రీనివాస్ ప్రతి నెల 9 లేదా 10న తన సొంత ఖర్చులతో తాండూర్ ప్రభుత్వ ఆసుపత్రి నందు పేద ప్రజలకు టిఫిన్స్ సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అన్న అంటే ఎంతో ప్రేమ ప్రాణమని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా తన బషీరాబాద్ మండలంలో తాండూర్ నియోజకవర్గంలో అప్పుడప్పుడు సేవ కార్యక్రమాలు చేసేది అందరికీ తెలిసిన విషయమనిప్రజాసేవకే జీవితం అంకితంగా సాగుతుందని కాంగ్రెస్ పార్టీ యువనాయకులు శ్రీనివాస్అన్నారు.




# నూతన క్రిమినల్ చట్టాలపై పోలీసులకు శిక్షణ

## మూడవ బ్యాచ్‌లో 42 మంది అధికారులు, సిబ్బందికి అవగాహన



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి): నూతన క్రిమినల్ చట్టాలపై పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించి, విధి నిర్వహణలో మరింత నైపుణ్యాన్ని పెంపొందించేందుకు వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం (డీటీసీ) ఆధ్వర్యంలో ఆర్మ్డ్ రిజర్వ్ (ఏఆర్) పోలీసు సిబ్బందికి నిర్వహిస్తున్న ఒకరోజు శిక్షణలో భాగంగా శుక్రవారం మూడవ బ్యాచ్ శిక్షణ ప్రారంభమైంది. ఈ బ్యాచ్‌లో వివిధ హోదాలకు చెందిన 42 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ శిక్షణలో నూతన క్రిమినల్ చట్టాల్లోని కీలక నిబంధనలు, వాటి అమలు విధానం, విధి నిర్వహణలో పాటించాల్సిన చట్టపరమైన అంశాలు, కేసుల దర్యాప్తులో అనుసరించాల్సిన మార్గదర్శకాలపై అవగాహన కల్పిస్తున్నారు. చట్టాలకు అనుగుణంగా విధులు నిర్వహించడం, దర్యాప్తు ప్రక్రియలో నిబంధనలను సక్రమంగా పాటించడం, పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించడం లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పోలీసు సిబ్బందికి నిరంతరం శిక్షణ అందించడం ద్వారా నూతన చట్టాలపై పూర్తి అవగాహన పెంపొందించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పోలీస్ శాఖ తెలిపింది.

ఈ కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ శ్రీనివాస్, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.